మార్చి తర్వాత గ్యాస్ కనెక్షన్లు

- లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ ఉన్నట్లా? లేనట్లా?
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలంటున్న గ్యాస్ వినియోగదారులు

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 321 | విజయవాడ, సోమవారం 23 జూన్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 23 June 2025 | Rs

బుమ్రా బూమ్‌బూమ్

- ఐదు వికెట్లతో విజృంభణ
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 465/10

6

జగన్‌పై కేసు

- ఆయన కారు కింద పడే సింగయ్య మృతి
- నిర్ధారించిన గుంటూరు జిల్లా పోలీసులు
- మాజీ సిఎం సహా ఆరుగురిపై కేసు : ఐజి త్రిపాఠి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా ఏటుకూరులో ఈ నెల 18న వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సిహెచ్ సింగయ్య అనే వ్యక్తి మరణించడంపై పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాన్వాయ్‌లోని జగన్ కారు కింద పడి సింగయ్య తీవ్రంగా గాయపడ్డారని, ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారని గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. దీంతో జగన్‌పై కూడా కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి త్రిపాఠి మీడియాకు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా డ్రోన్‌లు, సిసి కెమెరాల ద్వారా సేకరించిన పుటేజీలను, ఈ ఘటనకు సంబంధించి ఇతరులు పంపిన వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఆయన తెలిపారు. తాడేపల్లి నుంచి వచ్చిన కాన్వాయ్‌లో మొత్తం 50 వాహనాలున్నాయన్నారు. వీటిలో జగన్ ప్రయాణిస్తున్న కారు కింద సింగయ్య పడినట్లు వీడియోల్లో నిర్ధారణ అయిందని త్రిపాఠి తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా మీడియాకు పోలీసులు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఇది వరకే నమోదైన కేసును తాజా సమాచారం ఆధారంగా మార్పుచేర్పులు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ పేర్కొన్నారు. వాహనంలో ఉన్న జగన్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్నినాని, విడదల రజని, జగన్ పిఎ నాగేశ్వరరెడ్డి, కారు డ్రైవర్ రమణారెడ్డితో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డ్రైవర్ రమణారెడ్డి ఎఆర్ కానిస్టేబుల్‌గా ఉన్నారని, ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిపారు. అయితే జగన్ కాన్వాయ్‌లోని ఒక ప్రయివేటు వాహనం ఢీకొని సింగయ్య గాయపడినట్లు తొలుత చెప్పారు కదా? అని విలేకర్లు ప్రశ్నించగా.. అప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు ఆ రోజు అలా చెప్పామని పేర్కొన్నారు. ఈ అంశంలో న్యాయపరమైన సలహాలు తీసుకొని సంబంధిత సెక్షన్ల కింద కేసులో మార్పులు చేసినట్లు తెలిపారు. సింగయ్య భార్య ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నల్లపాడు పోలీసుల అదుపులో డ్రైవర్ రమణారెడ్డి

జగన్ కారు డ్రైవర్ రమణారెడ్డిని నల్లపాడు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఏటుకూరు వద్ద జరిగిన ఘటనపై ఆయనను విచారిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం కింద వ్యక్తి పడినట్లు గుర్తించారా? ఆ సమాచారాన్ని జగన్‌కు తెలియజేశారా? ప్రమాదం జరిగిన వెంటనే వాహనం ఆపకుండా ఎందుకు వెళ్లిపోయారు? తదితర అంశాలపై ఆయనను ప్రశ్నించారు.

తాడేపల్లిలో సజ్జలపై కేసు నమోదు 2

క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు

- కేంద్ర బృందం రహస్య విచారణ
- ఏలూరులో కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

క్రీడాకారిణుల పట్ల ఏలూరు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)లో ప్రధాన కోచ్‌తోపాటు, సహచర కోచ్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. కోచ్‌ల వేధింపులపై కేంద్ర కార్యాలయానికి క్రీడాకారిణులు ఫిర్యాదు చేయడంతో కేంద్ర బృందం రంగంలోకి దిగి అత్యంత రహస్యంగా విచారణ చేపట్టింది. క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు వాస్తవమేనని తేలడంతో శనివారం రాత్రి పోలీసులకు కేంద్ర బృందం సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేంద్ర బృందం విచారణ అంశాలతో పాటు క్రీడాకారిణుల నుంచి వివరాలు సేకరించారు. ఆదివారం కూడా విచారణ కొనసాగింది.

ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కనే ఏర్పాటు చేసిన శాయ్ కేంద్రంలో వెయిట్ లిఫ్టింగ్‌లో సుమారు 45 మంది క్రీడాకారిణులు శిక్షణ పొందుతున్నారు. క్రీడాకారిణుల పట్ల శాయ్ ఇన్‌చార్జితో పాటు వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ కోచ్ అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతుండడంతో వారంతా కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాలపై బెంగుళూరు శాయ్‌లోని ఇద్దరు సభ్యుల బృందాన్ని విచారణకు పంపింది. ఏలూరు శాయ్‌లో గత కొద్ది రోజులుగా రహస్య విచారణ చేపట్టి క్రీడాకారిణులు చేసిన ఫిర్యాదులు వాస్తవమేని నిర్ధారించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన కోచ్ వినాయక్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఏలూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

ఇరాన్ అణు కేంద్రాలపై

అమెరికా దాడులు

ఆత్మరక్షణకు అన్ని అవకాశాలు ఉపయోగించుకుంటామన్న ఇరాన్

'హర్మోజ్ జలసంధి' మూసివేతకు పార్లమెంట్ ఆమోదం

టెహ్రాన్ : అగ్రరాజ్యం మరోసారి తన యుద్ధోన్మాద ధోరణిని బయటపెట్టింది. ఇరాన్‌పై క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్‌కు ఇప్పటివరకూ ఆయుధాలు, నిధులు సమకూర్చడం ద్వారా పరోక్ష మద్దతు తెలిపిన అమెరికా ఇప్పుడు నేరుగా యుద్ధ రంగంలోకి దిగింది. ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై శనివారం రాత్రి దాడి చేసింది. శాంతి స్థాపనకు ముందుకు రాకుంటే మరిన్ని దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. దౌత్యానికి రెండు వారాల గడువు ఇస్తున్నామని రెండు రోజుల క్రితమే చెప్పిన ట్రంప్ ఇప్పుడు హఠాత్తుగా దాడులపై ప్రకటన చేశారు.

అమెరికా దాడులు 'శాశ్వత పరిణామాల'కు దారి తీస్తాయని ఇరాన్ తెలిపింది. తాజా పరిస్థితిపై చర్చించేందుకు ఐరాస భద్రతా మండలిని అత్యవసరంగా సమావేశపరచాలని కోరింది. అమెరికా దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయిల్‌పై భారీగా క్షిపణులు ప్రయోగించింది. దాడులకు ప్రతిగా 'విచారకరమైన స్పందన'ల కోసం ఎదురు చూడాలని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అమెరికాను హెచ్చరించింది.

దాడులు ఇలా...

ఫోర్డో, నటాంజ్, ఎస్ఫహాన్‌లోని ఇరాన్ అణు స్థావరాలపై 'అత్యంత విజయవంతం'గా దాడి చేశామని ట్రంప్ ఆదివారం సామాజిక మాధ్యమంలో ప్రకటించారు. దాడులలో బి-2 రహస్య బాంబర్లను ఉపయోగించామని ఆయన ధృవీకరించారు. ఈ బాంబు సంప్రదాయ వార్‌హెడ్‌ను మోసుకుపోతుంది. అది పేలడానికి ముందు భూమిలోకి 200 అడుగుల లోతు వరకూ చొచ్చుకుపోతుంది. ఒకే సమయంలో ఇలాంటి అనేక బాంబులను ప్రయోగించవచ్చు. ప్రతీ దాడిలోనూ వార్‌హెడ్ భూగర్భాన్ని మరింత తొలుచుకుంటూ వెళుతుంది. ఫోర్డోపై జరిపిన దాడిలో ఏడు బి-2 బాంబర్లను ఉపయోగించారు. ఇక ఎస్ఫహాన్ అణు స్థావరంలోని కీలక లక్ష్యాలపై అమెరికా జలాంతర్గామి నుండి రెండు డజన్లకు పైగా తొమాహాక్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించారు.

ఇరాన్‌లోని ఫోర్డో అణుకేంద్రంపై బంకర్ బస్టర్ బాంబులతో దాడి చేస్తున్న అమెరికాకు చెందిన బి2 బాంబర్లు

'హర్మోజ్ జలసంధి' మూసివేతకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం

తమ దేశంలోని అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా బాంబుల దాడి నేపథ్యంలో.. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మోజ్ జలసంధిని మూసివేయాలన్న ప్రతిపాదనకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. తుది నిర్ణయాన్ని ఆ దేశ అత్యున్నత భద్రతా సంస్థ తీసుకోవాల్సి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం మిగతా 5లో

వాయిదా కట్టలేదని ఇంటికి తాళం

20 రోజులుగా బయటే ఉంటున్న గిరిజన దంపతులు

శృతిమించుతున్న ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ వేధింపులు

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

ప్రకాశం, బాపట్ల జిల్లాలో ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ వేధింపులు శృతిమించుతున్నాయి. వాయిదాలు కట్టకపోతే ఇంటికి వచ్చి నానా రచ్చచేయడం, అందరి ముందు అవమానించడం, ఇంటికి తాళాలు వేయడం వంటి చర్యలకు పాల్పడుతోంది. తాజాగా ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం బింగినపల్లి గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న గిరిజన దంపతుల ఇంటికి తాళం వేసింది. కుమారుడు తీసుకున్న అప్పుకు వాయిదాలు చెల్లించలేదని ఇంటి నుంచి దంపతులను గెంటివేసింది. 20 రోజులుగా వారు ఇంటి బయటే జీవనం కొనసాగిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం.. బింగినపల్లి యానాది కాలనీకి చెందిన దంపతులు పొట్లూరి వెంకాయమ్మ, వెంకటేశ్వర్లు కుమారుడు వెంకటాద్రి... ఫైవ్‌స్టార్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఇంటిని తాకట్టు పెట్టి.. రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే ఆ అప్పు తీసుకున్న సమయంలో రూ.1.70 లక్షలు మాత్రమే అతని ఖాతాలో వేశారు. మిగతా డబ్బులు రెవెన్యూ సబ్ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది, ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు తీసుకున్నారు. అప్పటి నుంచి వాయిదాలు సకాలంలో చెలిస్తూ వచ్చారు. అయితే గత రెండు నెలల నుంచి తీవ్ర ఇబ్బందులు రావడంతో వాయిదాలు కట్టలేదు. 20 రోజుల క్రితం ఫైనాన్స్ ఏజెంట్లు వచ్చి.. ఇంటికి హెచ్చరిక బోర్డు పెట్టి.. తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో వెంకటేశ్వర్లు, వెంకాయమ్మ తమ ఇంటి ఆరు బయట వంట చేసుకొని.. అక్కడే నిద్రిస్తున్నారు. తమ కొడుకు అప్పు చేసి.. నెలనెలా వాయిదాలు కడుతున్నారని, రెండు నెలల కట్టకపోయేసరికి.. తమ ఇంటి నుంచి తమను గెంటేయడం అన్యాయమని, తమకు న్యాయం చేయాలని మీడియా ముందు దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

తాళం వేసిన ఇంటి ముందు విలపిస్తున్న గిరిజన దంపతులు

డిఎస్‌సి పిజిటి 'కీ' విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సిలో ఈ నెల 14వ తేదీన నిర్వహించిన పిజిటి బోటనీ, 17న జరిగిన జువాలజీ పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదలైంది. ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించిన ఈ పరీక్షల 'కీ'లను మెగా డిఎస్‌సి apdsc.apcfss.in వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచినట్లు మెగా డిఎస్‌సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి వీటి రెస్పాన్స్ షీట్‌లు అభ్యర్థుల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వెల్లడించారు. ప్రాథమిక కీ అభ్యంతరాలను తగిన ఆధారాలతో ఈ నెల 29వ తేదీలోపు వెబ్‌సైట్ ద్వారా మాత్రమే తెలియజేయాలని తెలిపారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా డిజిటి తెలుగు, పిజిటి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

అమెరికా దాడులపై

వామపక్షాల ఖండన

దురాక్రమణకు వ్యతిరేకంగా నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ : ఇరాన్‌పై అమెరికా దాడులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇది ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, ఐక్యరాజ్య సమితి ఛార్టర్‌ను ఉల్లంఘించడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. అమెరికా దాడులు అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెంచుతాయని, పశ్చిమాసియాను అస్థిరపరుస్తాయని, తీవ్రమైన ఆర్థిక పరిణామాలు సంభవిస్తాయని తెలిపాయి. ఈ మేరకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎం-ఎల్ లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్‌బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ఆదివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

'ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తున్నందుకే దాడులు చేశామంటూ అమెరికా, ఇజ్రాయిల్ తమ చర్యను సమర్ధించుకుంటున్నాయి. కానీ ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాస్సీ ఈ నెల 19న ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ ఓ పద్ధతి ప్రకారం అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని చెప్పడానికి తమ వద్ద ఎలాంటి ఆధారం లేదని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని నిర్ధారణకు రావడానికి తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు కూడా అంగీకరించాయి. అదీకాక అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై ఇరాన్ సైతం సంతకం చేసింది. వాస్తవాలు ఇలా ఉండగా, ఈ నెల 12న ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించింది. ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరగకుండా అడ్డుకునేందుకు ఇజ్రాయిల్ ఈ దాడులు జరుపుతోంది. ఇప్పుడు అమెరికా కూడా ఈ దాడులకు ఇజ్రాయిల్‌తో చేతులు కలిపింది. దౌత్య చర్చలకు రెండు వారాల సమయం ఇస్తున్నానని ప్రకటించి కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడులు జరిపారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు తమ ఇంటెలిజెన్స్ అంచనాలు, దౌత్య ప్రక్రియలపై పెద్దగా గౌరవం లేదని దీనివల్ల అర్థమవుతోంది. ఇరాన్ పైన, మొత్తంగా దక్షిణాసియా ప్రాంతం పైన యుద్ధాన్ని రుద్దాలని అవి భావించాయి. ఇరాన్‌ను ధ్వంసం చేయడం, పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడం, అమెరికా మిగతా 5లో

పుట్టినరోజునే మృత్యువాత

రోడ్డు ప్రమాదంలో భార్యతో పాటు జవాన్ మృతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

పుట్టినరోజు శ్రీవారిని దర్శించుకుని, భార్య పిల్లలతో కలిసి ఆనందంగా ఇంటికి వెళ్తున్న ఓ జవాన్ జీవితం అర్ధాంతరంగా ముగిసింది. రోడ్డు ప్రమాదంలో భార్యతోపాటు తాను అసువులు బాసిన విషాదకర ఘటన ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కుప్పిగానేపల్లి రామాపురానికి చెందిన సిద్ధయ్య ఆర్మీ జవానుగా గతంలో విధులు నిర్వహించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అంగ రక్షకుడుగా (గన్‌మాన్) కొంత కాలం పనిచేశారు. జూన్ 22న అతని పుట్టినరోజు కావడంతో తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి శనివారమే తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం కారులో గుడిపాలకు బయలుదేరారు. చంద్రగిరి మండలం తూర్పుపల్లి వద్ద వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి పక్కనున్న డివైడర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అవ్వడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న నలుగురిని అతికష్టం మీద బయటకు తీశారు. అయితే అప్పటికే జవాన్ సిద్ధయ్య (40) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆయన భార్య జ్యోతి(36)ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించారు. వారి కుమార్తె, కుమారుడు ఇద్దరనీ రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. జాతీయ రహదారిలో ప్రమాదం జరగడంతో వాహనాలు రహదారిపై నిలిచిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంటల్లో కాలిపోతున్న కారు

బాలికపై అమానుషం

- దొంగతనం అనుమానంతో ఒంటిపై వాతలు

ప్రజాశక్తి - ఇందుకూరుపేట

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలో అమానుషం చోటు చేసుకుంది. సెల్‌ఫోన్ దొంగతనం చేసిందన్న అనుమానంతో బాలిక ఒంటిపై పినతల్లి వాతలు పెట్టారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... కుడితిపాలెం గ్రామంలోని కాకర్లదిబ్బ ఎస్‌టి కాలనీకి చెందిన బాలిక గందల చెంచమ్మ (10) నివశిస్తున్నారు. సెల్‌ఫోన్ దొంగతనం చేసిందన్న అనుమానంతో పక్కింటి వారితో కలిసి పినతల్లి కర్కశత్వానికి పాల్పడింది. కాల్చిన గరిటెతో చిన్నారి ముఖం, ఒంటిపై వాతలు పెట్టారు. కాలిన గాయాలతో బాధపడుతున్న చిన్నారిని స్థానికులు గమనించి ఆరా తీశారు. వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితులు బండి శ్రీనివాసులు, కత్తి సుబ్బమ్మ, చలంచర్ల నాగరాజు, బండి సార్యామ్మడమ్మ, పిన్నతల్లి సన్నారి మాణిక్యంలను అదుపులోకి తీసుకున్నారు.

బాక్సైట్ గనుల కేటాయింపు తగదు

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలోని చింతపల్లి, అరకు, అనంతగిరి పరిధిలోని బాక్సైట్ నిక్షేపాలను ఎపి ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి), నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండిసి), నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో)కు కేటాయించేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఖండించారు. బాక్సైట్ నిక్షేపాలను పై సంస్థలకు కేటాయించనున్నట్లు వచ్చిన వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. హుకుంపేట మండలం రంగశీల గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఏజెన్సీకి నష్టం కలిగించే చర్యలను ఆదివాసీలు తిప్పికొట్టాలని కోరారు. 2015 నవంబర్ 5న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చింతపల్లి ప్రాంతంలోని జర్రెల బ్లాక్‌కు చెందిన 1521 హెక్టార్లలో బాక్సైట్ నిక్షేపాలను ఎపిఎండిసికి లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ జిఒ నెంబర్ 97 విడుదల చేశారని, ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర ప్రజా సంఘాలు, సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఆ జిఒను రద్దు చేయాలని సుదీర్ఘ పోరాటం చేశాయని గుర్తుచేశారు. ఫలితంగా 2019లో అప్పటి వైసిపి ప్రభుత్వం జిఒ నెంబర్ 97ని రద్దు చేసిందన్నారు.

పాడేరు ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ నెంబర్ 3 చట్టబద్ధత కోసం ఆదివాసీలు పోరాటం చేస్తుంటే టిడిపి కూటమి ప్రభుత్వం ఆ పని చేయకుండా ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో 600 మిలియన్ల బాక్సైట్ నిక్షేపాలను ఎపిఎండిసి, ఎన్‌ఎండిసి, నాల్కో సంస్థలకు అప్పగించాలని చూస్తున్నట్టు వస్తున్న వార్తలతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారన్నారు. టూరిజం అభివృద్ధికి 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొద్ది రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న బాక్సైట్ నిక్షేపాల తవ్వకాల కోసమేనని అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణారావు, మండల నాయకులు పాంగి లింగమూర్తి, కె.లక్ష్మణ్, విశ్వనాథం పాల్గొన్నారు.

స్థానికులతో కలిసి మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

వెటర్నరీ కళాశాల ప్రిన్సిపల్‌ను అరెస్టు చేయాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

తిరుపతి శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో డెయిరీ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కుల వివక్షకు పాల్పడ్డ కళాశాల ప్రిన్సిపల్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని, కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలు కుల వివక్షకు కేంద్రాలుగా మారడం శోచనీయమన్నారు. సెలవుల్లో ఉన్న సమయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రూమ్‌లోని టేబుళ్లు, కుర్చీలు, వస్తువులను తొలగించి అతనిని అవమానించడం దుర్మార్గమన్నారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన ప్రిన్సిపల్‌ను పదవి నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కళాశాలలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఈ వివక్షతపై ప్రజాసంఘాలు ప్రజాస్వామిక వాదులు దళిత సంఘాలు సంయుక్తంగా పోరాటం చేస్తాయని పేర్కొన్నారు.

బదిలీల్లో అసంబద్ధాలను పరిష్కరించాలి

- హైస్కూళ్లలో సమాంతర మీడియం కొనసాగించాలి
- యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బదిలీలు, రేషనలైజేషన్‌లలో ఉన్న అసంబద్ధాలను తక్షణం పరిష్కరించి ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశ నిర్ణయాలను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా మీడియాకు వెల్లడించారు. బదిలీలు, రేషనలైజేషన్‌లో వచ్చిన గ్రీవెన్స్‌లను తక్షణం పరిష్కరించాలని కోరారు. బదిలీల చట్టానికి భిన్నంగా అధికారులు నిబంధనలను అమలు చేయడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ప్రధానంగా స్పౌజ్ ఉపాధ్యాయుల విషయంలో, ప్రిఫరెన్షియల్ కేటగిరి విషయంలో నిబంధనలు పక్కన పెట్టి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని విమర్శించారు. క్లస్టర్ ఖాళీల విషయంలో ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా అధికారులు వ్యవహరించడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోయారని తెలిపారు. డిఇఒ పూల్ ఉపాధ్యాయుల విషయంలో కూడా అధికారులు మొండిగా వ్యవహరించడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల అనంతరం జీతాల సమస్య ఉత్పన్నమైతే పరిష్కరించాల్సిన విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడాన్ని కార్యవర్గం తీవ్రంగా ఖండించిందని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరంలో బోధనకే ఉపాధ్యాయులను పరిమితం చేస్తానని చెప్పిన విద్యాశాఖ అధికారులు పాఠశాల పున:ప్రారంభమైన నాటి నుంచి బోధనేతర కార్యక్రమాలు చేయిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బోధనకే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సమాంతర మాధ్యమాన్ని పున:ప్రారంభించాలని, కౌన్సెలింగ్‌లో వచ్చిన గ్రీవెన్సులను తక్షణం పరిష్కరించాలని, జీతాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడిపై నమ్మకాన్ని కలిగిద్దాం

విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైతిక విలువలు నేర్పడం ద్వారా ప్రభుత్వ బడి పట్ల తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని సమావేశంలో పిలుపునిచ్చారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైందని, ఉపాధ్యాయులపై నమ్మకంతో తల్లిదండ్రులు ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్చుతున్నారని తెలిపారు. చదవడం, రాయడం, నైతిక విలువలు విద్యార్థులకు నేర్పడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని కోరారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్చడానికి డ్రైవ్ చేపట్టాలన్నారు. రోజువారీ పనికి వెళ్లే తల్లిదండ్రుల పిల్లలు ఎక్కువ మంది ప్రభుత్వ బడికి వస్తున్నారని చెప్పారు. వారికి ప్రేమ పూర్వకంగా బోధించడం ద్వారా మంచి పౌరులుగా తయారు చేయాలని సూచించారు. పాఠశాల ప్రారంభ దినాల నుండే విద్యలో వెనుకబడిన విద్యార్థులకు చదువుపట్ల ఆసక్తిని కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తిలో వచ్చే సమస్యలపై పోరాటం చేస్తూనే విద్యార్థులకు విద్య నేర్పడంలో చిత్తశుద్ధిని ఉపాధ్యాయులు ప్రదర్శించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి యుటిఎఫ్ శ్రేణులు, ఉపాధ్యాయులు నిరంతరం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి ఆర్ మోహనరావు, కార్యదర్శులు బి లక్ష్మిరాజా, ఎస్ మురళీమోహనరావు, ఎన్ అరుణకుమారి, ఎస్‌పి మనోహర్‌కుమార్, బి శుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎమ్‌డిసి ద్వారా బాండ్ల జారీకి ప్రయత్నాలు

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం మరోసారి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎమ్‌డిసి) ద్వారా ఈ నెల 24న నిబంధనలకు విరుద్ధంగా, మునుపెన్నడూ లేని విధంగా నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి) రూపంలో బాండ్ల జారీకి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన పలు కీలక అంశాలను లేవనెత్తుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. శాసనసభ ఆమోదం లేకుండా రాష్ట్ర ఖజానా నుంచి నిధుల ఉపసంహరణకు వీలు కల్పిస్తూ, ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ది స్టేట్)ను అందుబాటులోకి తెస్తున్నారని ఆరోపించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204ను పూర్తిగా ఉల్లంఘించడమేనన్నారు. అంతేకాకుండా, రాష్ట్ర సంచిత నిధిని హామీగా చూపి ఎపిఎమ్‌డిసి రుణాలు సేకరించడానికి అనుమతించడం ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని అన్నారు.

'అన్నదాతా సుఖీభవ'లో 2.83 లక్షల ఇ-కెవైసి పెండింగ్

- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్నదాతా సుఖీభవ పథకంపై రైతుల్లో గందరగోళం నెలకొంది. నేటికీ 2.83 లక్షల మందికి ఇ-కెవైసి ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఫలితంగా రైతు సేవా కేంద్రాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ పథకం కోసం రెవెన్యూ రికార్డుల ఆధారంగా ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసింది. మొత్తం 45.65 లక్షల మంది అర్హులుగా గుర్తించింది. ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు ఇ-కెవైసి పూర్తి కావాల్సి ఉందనే విషయం రైతుల్లో గందరగోళానికి కారణమైంది. సచివాలయాల్లో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తికాని లబ్ధిదారులు మాత్రమే ఇ-కెవైసి చేయించుకోవాల్సి ఉంది. ఈ విషయంపై వ్యవసాయశాఖ స్పష్టత ఇవ్వలేదు. ఇంత వరకూ ఒక్క ప్రకటన సైతం చేయకపోవడం గమనార్హం. పిఎసిఎస్‌ల పరిధిలో ఉన్న 22.32 లక్షల మంది రైతులు ఈ పథకం కింద లబ్దిపొందాల్సి ఉండగా, వీరిలో 19.48 లక్షల మందికి ఈ ప్రక్రియ పూర్తి చేశారు. మరో 2.83 లక్షల మందికి పూర్తి కాలేదు. ఇ-కెవైసి అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న జిల్లాల్లో శ్రీసత్యసాయి 21,281, ఏలూరు, 16,400, పశ్చిమ గోదావరి 16,379, అనంతపురం 16,307 ఉండగా, అల్లూరి సీతారామరాజు జిల్లా 3,490తో అతి తక్కువ సంఖ్యలో నిలిచింది.

9 అంశాల్లో ప్రభుత్వంపై అసంతృప్తి

- పనితీరు బాగోని 64 మంది ఎమ్మెల్యేలు
- కూటమి ఏడాది పాలనపై 'రైజ్' సంస్థ సర్వే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తొమ్మిది అంశాల్లో అసంతృప్తి ఉందని రైజ్ అనే సంస్థ తెలిపింది. కూటమి ఏడాది పాలన సందర్భంగా ఆ సంస్థ 17 అంశాలపై చేసిన సర్వే వివరాలను ఇటీవల వెల్లడించింది. ఈ సర్వేలో ప్రభుత్వ పనితీరు, ఎమ్మెల్యేల పనితీరు వంటి అంశాలపై ఆ సంస్థ సర్వే చేసింది. ప్రభుత్వ పనితీరు బాగుందని 52.80 శాతం, బాగాలేదని 26 శాతం, ఫర్వాలేదని 21.20 శాతం చెప్పినట్లు వెల్లడించింది. సర్వే చేసిన 17 అంశాల్లో 9 అంశాలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, 8 అంశాలపై అనుకూలంగా ఉన్నారని వెల్లడించింది.

విద్యుత్ హామీలు బుట్టదాఖలు

విద్యుత్ ఛార్జీల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని పేర్కొంది. ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ.15,487 కోట్ల భారాన్ని ప్రజలపై మోపింది. దీంతో విద్యుత్ ఛార్జీలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని వెల్లడించింది. అదేవిధంగా ప్రతినెలా వసూలు చేసే ఎఫ్‌పిపిసిఎ 40 పైసల ఛార్జీని కూడా అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేయలేదు.

పెచ్చుమీరిన ఎమ్మెల్యేల అవినీతి

ఎమ్మెల్యేల అవినీతి పెచ్చుమీరిందని తెలిపింది. కూటమిలో 64 శాతం మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని తెలిపింది. కేవలం 28 శాతం మంది ఎమ్మెల్యేల తీరు బాగుందని, 8 శాతం చెప్పలేమని సర్వేలో వచ్చినట్లు వెల్లడించింది. రెడ్ జోన్‌లో 52 మంది ఎమ్మెల్యేలు, ఆరెంజ్ జోన్‌లో 23 మంది ఉంటే గ్రీన్ జోన్‌లో కేవలం 30 మంది ఉన్నారు. 62 శాతం మంది జనసేన ఎమ్మెల్యేలకు, 22 శాతం మంది టిడిపి ఎమ్మెల్యేలకు ఈసారి గెలిచే అవకాశం లేదని పేర్కొంది. 10 మంది మంత్రుల పనితీరు బాగోలేదని, 9 మంది మంత్రులవి ఫర్వాలేదని, ఆరుగురి పనితీరే బాగుందని తెలిపింది. ఏడుగురు ఎంపిల పనితీరు కూడా బాగోలేదని, 11 మంది మాత్రం ఫర్వాలేదని, ఏడుగురు పనితీరే బాగుందని ప్రకటించింది. సెటిల్మెంట్లు, ఇసుక దందా, లిక్కర్ పర్సంటేజీలు ఎక్కువగా ఉందని సంస్థ తెలిపింది.

రాజధానికి రెండో విడత భూసేకరణ

రాజధాని అమరావతికి రెండో విడత భూసేకరణపై కూడా ప్రజలు అసంతృప్తితో ఉన్నట్లు పేర్కొంది. తొలి విడతలో సుమారు 53 వేల ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూ సమీకరణతో చేసింది. ఇప్పటి వరకూ భూములిచ్చిన రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. వీటిని అమలు చేయకుండానే మరోసారి భూ సమీకరణ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు అమరావతి అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెడుతున్నారని 78 శాతం తమ అభిప్రాయాలు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎమ్‌డియు) వాహనాలను కూటమి ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని రైజ్ సంస్థ వెల్లడించింది. ఇవి కాకుండా గ్రామీణంలో కొనుగోలు శక్తి క్షీణించిందని, ఆక్వా రైతులు, సాధారణ రైతులు కష్టాలు పడుతున్నారని పేర్కొంది. కక్షసాధింపులో వైసిపితో కూటమి ప్రభుత్వం పోటీ పడుతోందని తెలిపింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో కూటమి నేతల్లో అసంతృప్తి ఉందని పేర్కొంది.

యుపిలో ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడింది. వారిలో ముగ్గురు అధికార ఎన్‌డిఎ ఎమ్మెల్యేలే. బిజెపి ఎమ్మెల్యేలు ముజఫర్ నగర్ అల్లర్లు, విద్వేష ప్రసంగాలు, అత్యాచారంసహా పలు కేసులలో నిందితులు కాగా, ఎస్‌పి ఎమ్మెల్యేలపై కక్షసాధింపులో భాగంగా పెట్టిన కేసులు అనర్హత వేటుకు ప్రధాన కారణమవడం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో బిజెపి మిత్రపక్షమైన సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీపై అనర్హత వేటు వేశారు. మూడేళ్ల క్రితం నాటి విద్వేష ప్రసంగం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడినందుకు అబ్బాస్ అన్సారీ అనర్హత వేటుకు గురయ్యారు. అన్సారీపై వేటుతో ప్రస్తుత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో మొత్తంగా ఆరుగురు ఎమ్మెల్యేలు అనర్హత వేటుకు గురయ్యారు. వీరిలో ఎన్‌డిఎ, ఎస్‌పిలకు చెందిన చెరో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీకి 2022 ఫిబ్రవరి-మార్చిలో ఎన్నికలు జరిగాయి. 403 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడటం గమనార్హం. గత అసెంబ్లీలో నలుగురు ఎమ్మెల్యేలు అనర్హత వేటుకు గురయ్యారు. వారిలో బిజెపికి చెందిన ముగ్గురు, ఎస్‌పికి చెందిన ఒక్క ఎమ్మెల్యే ఉన్నారు.

పహల్గామ్ దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) కీలక పురోగతి సాధించింది. ఈ ఘాతుకానికి పాల్పడింది పాకిస్థాన్‌కు చెందిన ముగ్గురు లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) ఉగ్రవాదులకు సహకరించిన ఇద్దరు స్థానికులు పర్వేజ్ అహ్మద్ జోతార్ (బట్‌కోట్, పహల్గామ్ నివాసి), బషీర్ అహ్మద్ జోతార్ (హిల్ పార్క్, పహల్గామ్ నివాసి) లను అరెస్టు చేసినట్లు వెల్లడించింది. దాడికి ముందు పర్వేజ్, బషీర్ ఉద్దేశపూర్వకంగానే హిల్ పార్క్‌లోని ఒక సీజనల్ గుడిసెలో (ధోక్) ఈ ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారని పేర్కొన్నారు. వీరు ఉగ్రవాదులకు ఆహారం, వసతితో పాటు సహకారం కూడా అందించారని తెలిపారు.

తాడేపల్లిలో సజ్జలపై కేసు నమోదు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. దళిత జెఎసి నాయకులు కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 79, 352, 353 (2), 196(1) బిఎన్ఎస్ సెక్షన్ల కింద సజ్జలపై కేసు నమోదు చేసినట్లు సిఐ వీరేంద్రబాబు తెలిపారు.

రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్, బాలకృష్ణ తదితరులు

అత్యున్నత శ్రేణి హాస్పిటల్‌గా 'బసవతారకం'

- బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ 25వ రజతోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య భారత్‌ను అందించడంలో హాస్పిటల్స్ చేస్తున్న కృషి భవిష్యత్‌లోనూ కొనసాగించాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరారు. క్యాన్సర్ చికిత్సలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రజతోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ హాజరై మాట్లాడారు. జీవించే హక్కును అందించడంలో బసవతారకం హాస్పటల్ ముందంజలో ఉందన్నారు. 2000వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ హాస్పిటల్ నేడు భారత దేశంలోనే అత్యున్నత శ్రేణి హాస్పిటల్‌గా రూపాంతరం చెందిందని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఎన్నో చాలెంజింగ్ కేసులకు చికిత్స అందించాలన్నదే తమ అమ్మగారి కోరిక అని, దాన్ని పూర్తి చేయడం గర్వకారణమని చెప్పారు. వచ్చే ఏడాది ఇదే రోజు రజతోత్సవ ముగింపు వేడుకలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో భారీ ఎత్తున నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తిగా లాభాపేక్ష లేకుండా రోగి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే భేదాలు చూపించకుండా క్యాన్సర్‌తో హాస్పిటల్‌కు వచ్చిన వారికి చికిత్స అందించే దిశగా సంస్థ పని చేస్తోందని వివరించారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ వెయ్యి పడకల హాస్పిటల్ నిర్మాణానికి స్వీకారం చుట్టనున్నట్టు తెలిపారు. తమ హాస్పిటల్‌కు రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తి సహకారం అందిస్తున్నట్టు చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మార్చి తర్వాత గ్యాస్ కనెక్షన్లు

- లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ ఉన్నట్లా? లేనట్లా?
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలంటున్న గ్యాస్ వినియోగదారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.50 లక్షల నూతన గ్యాస్ కనెక్షన్లు ఈ ఏడాది మార్చినెల తర్వాత పెరిగినట్లు సమాచారం. వీరందరూ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల (దీపం-2) జాబితాలో నమోదయ్యారా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ కనెక్షన్ ఉండి సిలిండర్లు బుక్ చేసుకుంటున్న వారిలో అనేక మందికి ప్రభుత్వం రీఫండ్ చేస్తామన్న నగదు వారి ఖాతాల్లోకి సకాలంలో జమకావడం లేదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తపరుస్తున్నారు. ఓ గ్యాస్ వినియోగదారునికి రెండు లేక మూడు బ్యాంకు అకౌంట్లు ఉన్నట్లయితే ఏ అకౌంట్‌లో గ్యాస్ ఏజెన్సీకి చెల్లించిన నగదు జమవుతుందో

అర్థంకాని పరిస్థితి నెలకొంది. చిట్టచివరిగా ఏ అకౌంట్ తెరుస్తారో ఆ అకౌంట్‌లో సబ్సిడీ మొత్తం జమవుతుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సక్రమంగా ఈ అమౌంట్ జమకావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా అకౌంట్‌లో నగదు జమైన వెంటనే సంబంధిత వినియోగదారుని ఫోన్‌కు బ్యాంకు నుంచి గానీ లేక జమచేసినట్లు గ్యాస్ ఏజెన్సీ నుంచి గానీ మెసేజ్‌లు రాకపోతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 2024 నవంబరు నుంచి ఈ ఏడాది మార్చి 25 వరకు పరిశీలిస్తే 97.59 లక్షల మందికి సిలిండర్లు డెలివరీ కాగా, ఇందులో 96.65 లక్షల మందికి సబ్సిడీ వారి ఖాతాల్లో జమైనట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. మొత్తమ్మీద రూ.846 కోట్లు సబ్సిడీ కింద నగదును ప్రభుత్వం రిలీజ్ చేస్తే అందులో ఈ నెల 6 వరకు గ్యాస్ ఏజెన్సీలు కేవలం రూ.764 కోట్లు వినియోగదారుల ఖాతాల్లో జమ చేశాయి. ఇంకా రూ.82 కోట్లు జమ చేయాల్సి ఉన్నట్లు స్పష్టమవుతోంది. అర్హులందరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో అర్హులందరికీ అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం 1,18,479 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటిలో అర్హులైన వారిని ఎంపిక చేసిన అనంతరం ఆయా లబ్ధిధారులు కూడా ఉచిత గ్యాస్ సిలిండర్ల జాబితాలో చేరుస్తారా? లేక మార్చి ముందు ఉన్న గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారులకే పరిమితం చేస్తారా? అనే అంశంపై ప్రభుత్వం వైపు నుంచి స్పష్టత లేదు. దీంతో గ్యాస్ కనెక్షన్ల వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇరాన్ అధ్యక్షుడికి మోడీ ఫోన్

న్యూఢిల్లీ : మధ్యప్రాచ్యంలో నెలకొన్న తాజా పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో మాట్లాడారు. ఉద్రిక్తతలు పెరగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వాటిని వెంటనే తగ్గించాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా శాంతి, భద్రత, సుస్థిరత పునరుద్ధరణకు చర్చలు, దౌత్యాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఉద్రిక్తతలను వెంటనే తగ్గించుకోవాలన్న భారత్ ఆకాంక్షను తెలియజేశారు. అమెరికా దాడులు జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే ఇరువురు నేతల మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. అనంతరం మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెడుతూ తాజా ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిపై పెజెష్కియాన్‌తో వివరంగా చర్చించానని చెప్పారు.

దోమ సైజులో చైనా నిఘా డ్రోన్

బీజింగ్ : చైనాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ (ఎన్‌యుడిటి)కు చెందిన ఓ రోబోటిక్స్ ప్రయోగశాల దోమ పరిమాణంలో ఉన్న ఓ బుల్లి డ్రోన్‌ను తయారుచేసింది. హ్యూమనాయిడ్ మిషన్ల నుంచి కంటికి కనిపించని పరిమాణంలో ఉండే సూక్ష్మ డ్రోన్ల వరకు ప్రయోగశాలలో తయారుచేసిన రోబోలను ఎన్‌యుడిటి పరిశోధకులు చైనా సెంట్రల్ టెలివిజన్‌కు చెందిన సైనిక చానల్‌లో ఇటీవల ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దోమంత సైజులో ఉన్న ఓ సూక్ష్మ డ్రోన్ కూడా ప్రదర్శించారు. ఎన్‌యుడిటికి చెందిన ఒక విద్యార్థి తన చేతివేళ్లలో ఉంచుకుని ఈ బుల్లి డ్రోన్‌ను వీక్షకులకు చూపిస్తూ.. ఈ తరహా మైక్రో డ్రోన్లు యుద్ధ రంగంలో శత్రువులకు సంబంధించిన సైనిక రహస్యాలను చిత్రీకరించి, తీసుకువస్తాయని చెప్పాడు.

మదురైలో పవన్ కల్యాణ్

చెన్నై : ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. మురుగ భక్తర్గళ్ మానాడులో పాల్గొనేందుకు ఆదివారం పవన్ కళ్యాణ్ మదురై చేరుకున్నారు. మధురై విమానాశ్రయంలో పవన్‌కు బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, పరిశీలకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఇతర నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. దేశం, ఇరు రాష్ట్రాల రాజకీయాలపై పవన్ వారితో చర్చించారు.

'ఆపరేషన్ మిడ్ నైట్ హ్యామర్' విధ్వంసం

- గొప్పలు చెప్పిన అమెరికా రక్షణ మంత్రి హెగ్ సేత్
- దాడులపై టెహ్రాన్ ఆగ్రహం

పెంటగాన్ : ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' విధ్వంసం సృష్టించింది. తమ ఆపరేషన్ గురించి అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్‌సేత్ మీడియా సాక్షిగా గొప్పలు చెప్పుకున్నారు. "శుక్రవారం అర్ధరాత్రి ఈ ఆపరేషన్ మొదలైంది. అమెరికా నుంచి బి-2 బాంబర్లు మొదలుకాగా.. డెకాయ్‌లో భాగంగా (దృష్టిమరల్చడానికి) కొన్ని పశ్చిమానికి, మిగతావి తూర్పునకు వెళ్లాయి. 18 గంటల ప్రయాణం అనంతరం ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. 30 వేల పౌండ్ల బరువు కలిగిన 14 బంకర్ విధ్వంసక బాంబులను అణు కేంద్రాలపై జారవిడిచాం. ఇస్ఫహాన్‌పై తొమాహాక్ క్షిపణులను ప్రయోగించాం. ఈ ఆపరేషన్‌లో ఏడు బి2 బాంబర్లు సహా మొత్తం 125కు పైగా యుద్ధ, ఇంధన, నిఘా విమానాలు పాల్గొన్నాయి. ఫోర్డో, నతాంజ్‌లపై సాయంత్రం 6.40 గంటలకు దాడులు చేపట్టి.. 7 గంటలకు ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేశాయి. ఇరాన్ స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2.10 గంటలకు ఈ దాడులు జరిగాయి " అని ' అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డేనియల్ కెయిన్ వెల్లడించారు. మిస్సోరీ స్థావరం నుంచి మొదలైన ఈ మిషన్.. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత చేపట్టిన అతి సుదూరమైన బి2 మిషన్ ఇదేనని కెయిన్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇరాన్‌లోని పలు స్థావరాలపై డజన్ల కొదీ తొమాహాక్ క్షిపణులను ప్రయోగించామన్నారు. ఇజ్రాయిత్ మద్దతుకు అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దాడుల కోసం కొన్ని నెలల పాటు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. "ఇరాన్‌లో పాలనా మార్పును కోరుకోవడం లేదు. అక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టడం మా దాడుల ఉద్దేశం కాదు. మా కమాండ్-ఇన్-చీఫ్ (ట్రంప్) నుంచి వచ్చిన ఆదేశాలను పాటించాం. ఇరాన్ అణు కార్యక్రమాన్ని తీవ్రంగా దెబ్బతీశాం. మొత్తంగా 14 బంకర్-బస్టర్ బాంబులను జారవిడిచాం. వీటికి పలు యుద్ధవిమానాలు సహాయంగా నిలిచాయి" అని తెలిపారు.

ఫోర్డోలోని కీలక భూగర్భ అణు స్థావరం అమెరికా దాడికి

మీడియాతో మాట్లాడుతున్న హెగ్ సేత్

గురైంది. దాడిలో ఈ స్థావరం యొక్క ప్రవేశ ద్వారాలు దెబ్బతిన్నాయి. బంకర్‌ను ధ్వంసం చేసే ప్రత్యేక బాంబులను అమెరికా ఉపయోగించిందని, ఫలితంగా ఆ స్థావరం చుట్టూ శిథిలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ తీసిన చిత్రాలను బట్టి తెలుస్తోంది. ఆకాశంలో దట్టంగా పొగలు కూడా వ్యాపించాయి.

దాడులు మరింత తీవ్రం చేస్తాం: ట్రంప్

అమెరికాకు, తమ పౌరులకు నష్టం కలిగించేలా ఇరాన్ ఎటువంటి చర్యలు తీసుకున్నా అగ్రరాజ్యం తీవ్రంగా స్పందిస్తుందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. తన మాటలను పెడచెవిన పెట్టి.. టెహ్రాన్ ప్రతీకార చర్యలకు పాల్పడితే మాత్రం శనివారం రాత్రి టెహ్రాన్‌పై చేసిన దాడుల కంటే తీవ్రంగా.. ఎన్నడూ చూడని విధంగా విరుచుకుపడతామన్నారు.

టెహ్రాన్ ఆగ్రహం

అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. 'ఇరాన్ శాంతియుత అణు స్థావరాలపై దాడి చేయడం ద్వారా ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశమైన అమెరికా ఐరాస ఛార్టర్, అంతర్జాతీయ చట్టం, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని (ఎన్‌పిటి) ఉల్లంఘించింది. ఈ ఉదయం జరిగిన పరిణామాలు అత్యంత దారుణమైనవి. ఇవి శాశ్వత పరిణామాలకు దారి తీస్తాయి. అత్యంత ప్రమాదకరమైన, అధర్మమైన, నేరపూరిత అమెరికా ప్రవర్తనపై ఐరాసలోని ప్రతి సభ్య దేశం ఆందోళన వ్యక్తం చేయాల్సి ఉంది. చట్టబద్ధంగా ఆత్మరక్షణ చేసుకునేందుకు ఐరాస ఛార్టర్, అందులోని నిబంధనలు అనుమతిస్తున్నాయి. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని, ప్రయోజనాలను, ప్రజలను కాపాడుకునేందుకు అన్ని అవకాశాలను వినియోగించుకుంటుంది' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పష్టం చేశారు. తాను మాస్కో వెళుతున్నానని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో తాజా పరిణామాలపై సంప్రదింపులు జరుపుతానని ఆయన చెప్పారు. ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఎదుర్కొనేందుకు ఇరాన్ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని కూడా ఆయన తెలిపారు. హర్మజ్ జలసంధిని మూసేస్తారా అని విలేకరులు ప్రశ్నించగా ఇరాన్ వద్ద అనేక అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. దౌత్య ప్రయత్నాలపై మాట్లాడుతూ 'ముందు మా స్పందన కోసం ఎదురు చూడండి. దూకుడు తగ్గినప్పుడు దౌత్యం గురించి నిర్ణయిస్తాం' అని అన్నారు. అణు స్థావరాలపై అమెరికా దాడులు చేసిన తర్వాత ఇక దౌత్యానికి అవకాశం ఏముంటుందని ప్రశ్నిస్తూ అయినా దౌత్యానికి ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంచుతామని తెలిపారు. అమెరికా అన్ని సరిహద్దులు దాటేసిందని, ఇక ఏమీ మిగలలేదని చెప్పారు. అణు స్థావరాలపై దాడి చేయడం ద్వారా అమెరికా అతి పెద్ద సరిహద్దును దాటిందని తెలిపారు. జరగబోయే పరిణామాలకు పూర్తి బాధ్యత అమెరికాయే తీసుకోవాల్సి ఉంటుం దని హెచ్చరించారు. ట్రంప్ ఇరాన్‌నే కాకుండా అమెరికాను కూడా మోసం చేశారని అబ్బాస్ అరగ్చీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

దాడులు...ప్రతి దాడులు

తన సైనిక స్థావరాలపై అమెరికా దాడులు చేసిన తర్వాత ఇరాన్ కూడా ప్రతి దాడులకు దిగింది. ఇజ్రాయిల్‌పై వరుసగా క్షిపణులు ప్రయోగించింది. దీనిని రెండు దేశాలు ధృవీకరించాయి. రాజధాని టెల్ అవీవ్ సహా దేశంలోని పలు ప్రాంతాలలో పేలుళ్లు సంభవించాయని ఇజ్రాయిల్ మీడియా తెలిపింది. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలో సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, క్షిపణులను ప్రయోగించామని ఇజ్రాయిల్ సైన్యం తెలియజేసింది. మరోవైపు ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఘర్షణలను నివారించేందుకు యూరోపియన్ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. పశ్చిమ, ఇరాన్ నేతల మధ్య నాలుగు గంటల పాటు ముఖాముఖి చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదు.

కాలుష్యం పెరగలేదు : ఐఎఇఎ

ఇరాన్ అణు స్థావరాలపై జరుగుతున్న సైనిక దాడుల కారణంగా కాలుష్య ప్రమాదం తలెత్తే అవకాశాలు పెద్దగా లేవని నిపుణులు తెలిపారు. అమెరికా దాడుల తర్వాత రేడియేషన్ స్థాయి పెరగలేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) చెప్పింది. ఇస్ఫహాన్‌లోని ఆరు భవనాలపై దాడి జరిగిందని, వాటిలో గతంలో దెబ్బతిన్న నాలుగు భవనాలు కూడా ఉన్నాయని ఐఎఇఎ వివరించింది. ఈ భవనాలలో కొన్నింటిలో అసలు అణు సామగ్రే లేదని, మరి కొన్నింటిలో కొద్దిగా ఉన్నదని తెలిపింది.

రెండు వారాల్లో నిర్ణయమంటూ.. రెండు రోజుల్లోనే...

ఇక్రాయిల్‌కు సహకరించడంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచాన్ని ఏమార్చారు. తాను చెప్పిన సమయం కంటే ముందుగా రెండు రోజుల్లోనే ఇరాన్‌పై ఆకస్మిక దాడులు చేపట్టారు. అమెరికా దాడుల గురించి ఏమీ తెలియనట్లే ఇజ్రాయిల్ ప్రకటనలు చేసింది. తీరా, అగ్రరాజ్యం దాడులు ముగిశాక.. తాము సమన్వయంతో వాటికి సహకరించామని ఇజ్రాయెల్ వెల్లడించింది. రెండు దేశాలు బహిరంగ ప్రకటనలతో శత్రు దేశాన్ని ఏమార్చి తమ యుద్ధ వ్యూహాన్ని అమలు చేశాయి.

'ఫోర్డో'కు ఉక్కు కవచంలా పర్వతం..

ఫోర్డో అణు ఇందన శుద్ధీకరణ కేంద్రం టెహ్రాన్ నగరానికి వంద కిలోమీటర్ల దూరం ఉంది. ఇక్కడ యురేనియం శుద్ధి చేస్తారు. పర్వతానికి అడుగు భాగాన సుమారు వంద మీటర్ల లోతులోని ఫోర్డో అణు కేంద్రం లక్ష్యంగా అమెరికా చేపట్టిన దాడుల్లో ఆ ప్రాంతం అతలాకుతలమైనట్లు ఉపగ్రహ చిత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఘటనాస్థలంలో భారీ బిలాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. దాడుల అనంతరం పర్వత భాగాలు రంగు మారడం, శిథిలాలు ఎగిరిపడటం అమెరికా బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించిందని చెప్పేందుకు నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు.

'నతాంజ్'య 50 వేల సెంట్రిఫ్యూజ్‌లకు కేంద్రం..

నతాంజ్ అణు శుద్ధీకరణ కేంద్రం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. కోహ్-ఎ-కొలాంగ్ గాజ్ లా పర్వతాన్ని తొలిచి దాని అడుగున దీన్ని విస్తరించే పనులు జరుగుతున్నాయి.

విద్యుత్, విద్యా విధానాలు మారాలి

- టిడిపి కూటమి ప్రభుత్వానికి శ్రీనివాసరావు సూచన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న విద్యుత్, నూతన విద్యా విధానాలను మార్చుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యరావు స్మారక భవనంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సమస్యలను పక్కనపెట్టి యోగా పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. ప్రధాని మోడీ మెప్పు కోసం డ్వాక్రా మహిళలు, ఉపాధి కార్మికులను బెదిరించి యోగా డేకు తరలించారన్నారు. గిన్నిస్ రికార్డులతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, దీనివల్ల వందల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము వృథా అయ్యిందని తెలిపారు. దానికి బదులు పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడా స్థలాలను అభివృద్ధి చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. యోగా అనేది ప్రపంచ వ్యాప్తంగా పెద్ద బిజినెస్‌గా మారిందని, బాబా రాందేవ్ పెద్ద కార్పొరేట్ వ్యక్తిగా మారడమే ఉదాహరణ అని అన్నారు. చివరకు నేవీలో పనిచేసే సైనికులతో కూడా యోగా గురువులు యోగాను చేయిస్తున్నారని తెలిపారు.

ఒత్తిడి తగ్గుద్ది అనే పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించడం పెద్ద బూటకమని అన్నారు. ప్రజలపై ఒత్తిళ్లకు అనేక కారణాలు ఉంటాయని వెల్లడించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక కనీస వేతనాలు కరువై నేడు ఒత్తిళ్లకు గురవుతున్నారని తెలిపారు. కనీస వేతనాల కోసం పెద్దాపురం మున్సిపల్ కార్మికులు 45 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వారందరికీ జీతభత్యాలు ఇచ్చి కనీస ప్రమాణాలు కల్పిస్తే ఒత్తిడి ఉండదన్నారు. విశాఖలో 5 వేల మంది స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఉక్కు పరిశ్రమ ఉంటుందా? లేక మూసేస్తారా? అనే అయోమయంలో కార్మికులు ఉన్నారని తెలిపారు. ప్రధాని మోడీ స్టీల్ ప్లాంట్ కార్మికులకు ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి వచ్చి ప్రజలను మభ్యపెట్టి పోవడమే తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. మోడీ మెప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం పాకులాడటమే తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏనాడు మాట్లాడలేదన్నారు.

ప్రతిపక్షంలో ఉండగా సెకీ ఒప్పందంపై కేసులు వేసి, నేడు అదే కంపెనీతో ఒప్పందం చేసుకోవడం శోచనీయమన్నారు. నోటీసులు ఇవ్వకుండా, రైతుల అనుమతులు లేకుండా అక్రమంగా భూములను సేకరించి ఆ కంపెనీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. నాడు జిఒ 117ను వ్యతిరేకించిన ఈ పెద్దలు నేడు అధికారంలోకి వచ్చి అదే జిఒను అమలు చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థను గందరగోళంగా మారుస్తున్నారని విమర్శించారు. ఈ విధానాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల స్కూళ్లు మూతపడే అవకాశం ఉందన్నారు. శ్రీ చైతన్య, నారాయణ లాంటి కార్పొరేటు విద్యాసంస్థలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చారని విమర్శించారు. సామాన్యులకు ప్రభుత్వ విద్యను అందుబాటులో లేకుండా చేస్తున్నారన్నారు. స్కూళ్ల మూసివేతపై తల్లిదండ్రుల ఉద్యమానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -పుంగనూరు (చిత్తూరు జిల్లా)

వెంకటరమణ (ఫైల్)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బోడేవారిపల్లి పంచాయతీ ఈడిగపల్లెకి చెందిన వెంకటరమణ (48) ఎకరా పొలం కౌలుకు తీసుకొని అప్పుచేసి టమాటా పంట సాగు చేశారు. మార్కెట్‌లో టమాటాకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. పంట సాగు, కుటుంబ పోషణ, పిల్లల చదువు నిమిత్తం రూ.4 లక్షల వరకు అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సమీపంలోని పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంఇఒల బదిలీలు చేపట్టాలి

- టిఎన్‌యుఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మండల విద్యాశాఖ అధికారుల (ఎంఇఒ) బదిలీలు చేపట్టాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్క సిఫార్సు బదిలీ లేకుండా, ఒక్క పోస్టు కూడా బ్లాక్ చేయకుండా అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు జరిగాయని ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎంఇఒలకు ఎనిమిదేళ్లుగా బదిలీలు జరగలేదని తెలిపారు. 2017 నుంచి ఒకేచోట చాలా మంది పనిచేస్తున్నారన్నారు. మండలాల్లో డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న సుమారు 200 మంది ఎంఇఒ-1లకు తమ జీతభత్యాలు చేసుకునే సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎంఇఒలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరారు.

సింగయ్య మృతికి జగన్ బలప్రదర్శనే కారణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలప్రదర్శనే సింగయ్య మృతికి కారణమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆరోపించారు. జగన్ సత్తెనపల్లి పర్యటనలో వంద మందికి అనుమతినిస్తే వేలాది మందిని వచ్చినా చోద్యం చూస్తూ కూర్చున్న ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్ వాహనం కింద పడి సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకమన్నారు. కారు కింద ఒక వ్యక్తి పడ్డారన్న సోయ లేకుండా కాన్వాయ్ కొనసాగడాన్ని తప్పుబట్టారు. వేలాది మంది ముందు సైడ్ బోర్డుపై నిలబడి జగన్ చేతులూపడం సరైన విధానం కాదన్నారు. జగన్ తన ఉనికి కోసం జనాలను టైర్ల కింద తొక్కుకుంటూ పోతున్నారని విమర్శించారు. ఈ సంఘటన జగన్ బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతుందని చెప్పారు. పర్మిషన్‌కు విరుద్ధంగా జనసమీకరణ జరుగుతుంటే పోలీసు, ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ప్రేక్షక పాత్ర వహించారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే కాంగ్రెస్ పార్టీపై ఆంక్షలు విధిస్తున్నారన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్, మరో న్యాయమూర్తి శాలిని ఉన్నారు. వీరికి రంగనాయక మండపంలో టిటిడి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

టిటిడికి ఎసి బస్సు విరాళమిచ్చిన అశోక్ లేలాండ్

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల తిరుపతి దేవస్థానానికి 41 సీటర్ ఎసి బస్సును ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ అశోక్ లేలాండ్ విరాళంగా అందించింది. సుమారు రూ. 35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ ఎంఅండ్‌హెచ్‌సివి అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు టిటిడి అధికారులకు అందజేశారు. సాధారణంగా ప్రతి ఏడాది అశోక్ లేలాండ్ కంపెనీ వారు టిటిడికి ఒక ఆటోమొబైల్ వాహనాన్ని విరాళంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుమల డిపో డిఐ వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

మంగళగిరిలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు

కర్నూలు జిల్లా దానాపురం సర్పంచ్ చంద్రశేఖర్ పట్ల కుల వివక్షత పాటించే విధంగా సభాముఖంగా అవమానపరిచిన ఆదోని బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, దళితులపై దాడులను అరికట్టాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని కెవిపిఎస్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే పార్థసారథి క్షమాపణలు కోరుతూ మత ప్రస్తావన చేయడం సిగ్గుచేటని, ఈ విషయంలో సిఎం వెంటనే కలుగజేసుకోవాలని కోరారు. మంగళగిరి పట్టణంలో దళిత మహిళ రాధా పట్ల బిజెపి పట్టణ అధ్యక్షుని భార్య ఎం.ప్రీతి అవమానకరంగా వ్యవహరించారని, పసుపు నీళ్లు చల్లారని, ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు జరగడంపై ఆయన బాధ్యత వహించాలన్నారు. కాకినాడ రూరల్‌లో డాక్టర్‌ను జనసేన ఎమ్మెల్యే కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటన మరువక ముందే దళితుల పట్ల కుల వివక్ష చూపుతూ మరిన్ని ఘటనలు కొనసాగడం దారుణమన్నారు. సనాతన ధర్మాన్ని కీర్తిస్తూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడిన తరువాత ఈ దాడులు పెరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జె.నవీన్‌ప్రకాష్, బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగళగిరిలో ఓ అట్రాసిటీ కేసులో సాక్షిగా ఉన్న ఆర్.రమాదేవిపై ప్రీతి బంధువులు మునగాల సుధాకర్ దాడి చేశారని, బాధిత కుటుంబానికి, సాక్షులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. తెనాలిలో దళితుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా ఈ నెల 28న 'చలో తెనాలి' చేపట్టనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంగళగిరి కొప్పురావు కాలనీలోని దళితురాలు పి.రాధ పట్ల బిజెపి పట్టణ అధ్యక్షుని భార్య ప్రీతి అసభ్యంగా వ్యవహరించడం, అట్రాసిటీ కేసులో సాక్షి అయిన రమాదేవిపై దాడి చేసిన నేపథ్యంలో బాధిత కుటుంబాలను కెవిపిఎస్ నాయకులు పరామర్శించారు. ఘటన గురించి అడిగి తెలుసుకుని బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. పోలీసులు ఉదాసీనత వ్యవహరించకుండా బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు.

'ఎస్‌వి వెటర్నరీ వర్సిటీ' ఘటనను ఖండించిన కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రవివర్మ దళితుడనే కారణంతో కనీసం కూర్చునేందుకు కుర్చీ కూడా లేకుండా చేయడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బాధితుడి పక్షాన పోరాడేందుకు దళిత, ప్రజా సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. బాధితులైన రవి వర్మకు కుర్చీ కేటాయించి కూర్చోబెట్టాలని కోరారు. ఈ దుర్మార్గమైన కులవివక్షపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలన్నారు.

ప్రజల్లోకి ప్రజోపయోగ కార్యక్రమాలు

- ఎంపి భోలా సింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపి భోలా సింగ్ పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత ఎస్‌సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి దేవానంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి తొలుత ప్రసంగించారు.

జెఎల్ఎం-2లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించండి

- నేడు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతిపత్రాలు

ప్రజాశక్తి-నెల్లూరు

సదస్సులో మాట్లాడుతున్న నర్సింగరావు, వేదికపై సూరిబాబు, సుదర్శన్‌రెడ్డి తదితరులు

జెఎల్ఎం-2లను (ఎనర్జీ అసిస్టెంట్లు) విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఎవిఎం ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జెఎల్ఎం-2 రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నర్సింగరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో జెఎల్ఎం-2ల పాత్ర ఎంతో కీలకమని, అటువంటి వారి పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. జెఎల్ఎం-2లకు చెల్లిస్తున్న వేతనాలు, డిస్కం ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాలకు భారీ వ్యత్యాసం ఉందన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లను కలిసి తమ న్యాయమైన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి జోక్యం చేసుకుని జెఎల్ఎం-2ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు మాట్లాడుతూ... 2019లో రాష్ట్రప్రభుత్వం, విద్యుత్ మేనేజ్‌మెంట్ కలిసి గ్రేడ్-2 జెఎల్ఎంల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసి, 7529 మందికి నియామకపు ఉత్తర్వులు అందజేసిందన్నారు. ఈ నేపథ్యంలో వారిని విద్యుత్ శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బందికి అందజేస్తున్న విధంగా వేతనాలు అందజేస్తూ, సర్వీసు నియమ నిబంధనలను పాటించకుండా జీతాల్లో తేడాలను చూపించడం సరికాదన్నారు. ఈ సదస్సులో గ్రేడ్-2 జెఎల్ఎం రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్, ఎస్‌కె జాకీర్‌హుస్సేన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో నేడు సమావేశం

- 26 జిల్లాల అధికారులు హాజరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం వెనుక భాగంలో సమావేశాన్ని నిర్వహించనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన జూన్ 12వ తేదీనే ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదం దృష్ట్యా వాయిదా వేశారు. ఏడాదిలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు అందించిన సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని సమీక్షించుకునేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. 2047 విజన్ వంటి దీర్ఘకాలిక ప్రణాళికలను కూటమి ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోంది. అమరావతి, పోలవరం నిర్మాణాలు, పరిశ్రమలు, పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పన గురించి అధికారులతో సిఎం చర్చించనున్నారు. రానున్న నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలనే అంశంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నారు. ఈ కార్యక్రమానికి 26 జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, హెచ్‌ఒడిలు, సెక్రటరీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు హాజరవుతారని ప్రభుత్వం తెలిపింది. గతేడాది ప్రోగ్రెస్ రిపోర్టు, ఈ ఏడాది చేపట్టే కార్యక్రమాల గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమావేశం ముగిసిన అనంతరం సిఎం, మంత్రులు అక్కడే డిన్నర్ చేయనున్నారు.

జగన్ కారుకు రోప్ పార్టీ ఏదీ?

- మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్న

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పర్యటనల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భద్రతను తగ్గించి అవాంఛనీయ సంఘటనలకు దోహదపడుతోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. జగన్‌కు ఇవ్వాల్సిన భద్రత, బందోబస్తు ఇవ్వడం లేదని, కనీసం ఆయన కాన్వాయ్ చుట్టూ ఉండాల్సిన రోప్ పార్టీని కూడా తొలగించారని తెలిపారు. గుంటూరులోని ఏటుకూరు బైపాస్ నుంచి సత్తెనపల్లికి వెళ్తున్న జగన్ వద్ద ఒక్క పోలీసు కూడా లేడని, ప్రజలు విపరీతంగా వస్తున్నా జగన్ కారు చుట్టూ ఉండాల్సిన రోప్ పార్టీని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. గుంటూరులో మృతి చెందిన వైసిపి కార్యకర్త సింగయ్య మృతి ఘటనను ప్రస్తావిస్తూ ఆ సందర్భంలో కార్యకర్తలంతా వేగంగా ముందుకు తోసుకువచ్చే సమయంలో ఒక వాహనం సింగయ్యను ఢీకొట్టిందని, దీంతో ఆయన వెళ్లి జగన్ కారు కింద పడినట్టు వీడియోలు వచ్చాయని తెలిపారు. వీటిని పూర్తి స్థాయిలో నిర్ధారించాల్సి ఉందన్నారు. జగన్ కారు నుంచి సింగయ్యను బయటకు లాగిన తరువాత కాన్వాయ్ ముందుకు వెళ్లినట్టు, తరువాత పోలీసులు ఆయన్ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసు అధికారులే ప్రకటించారని తెలిపారు. కొంత మంది పనిగట్టుకుని జగన్ కారు కింద పడి సింగయ్య మృతి చెందినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్‌కు వచ్చిన ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇలాంటి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

- సెలవులు ముగిసినా తగ్గని రద్దీ

ప్రజాశక్తి- తిరుమల: వేసవి సెలవులు ముగిసినప్పటికీ.. శ్రీవారిని దర్శించుకునేందుకు వేలసంఖ్యలో యాత్రికులు తిరుమలకు తరలివస్తున్నారు. దీంతో గత నెల రోజులుగా తిరుమల కొండపై రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి శ్రీవారిని దర్శించుకునేందుకు వేలాది మంది యాత్రికులు పోటెత్తడంతో.. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్మెంట్లు నిండిపోయి.. శిలాతోరణం వరకు క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. శనివారం ఒక్కరోజు 90,087 మంది యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. హుండీ కానుకల ద్వారా రూ.4.3 కోట్ల రికార్డ్ బ్రేకింగ్ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

నిర్వాసితుల ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

మా భూములు తిరిగి ఇచ్చేయండి

- జిందాల్ అల్యూమినియం నిర్వాసిత రైతుల ఆందోళన
- విజయనగరం-బొడ్డవర జాతీయ రహదారిపై ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం)

తమ వద్ద నుంచి సేకరించిన భూముల్లో జిందాల్ అల్యూమినియం కర్మాగారం ఏర్పాటు చేయనందున తిరిగి ఆ భూములను తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేస్తూ బొడ్డవర- విజయనగరం జాతీయ రహదారిపై నిర్వాసిత రైతులు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ జిందాల్ అల్యూమినియం కర్మాగారం నిర్మాణం కోసం గిరిజన రైతుల వద్ద నుండి సుమారు 115 ఎకరాల భూములు తీసుకొని నేటికీ 16 సంవత్సరాలు కావస్తోందని తెలిపారు.

కానీ నేటికీ కంపెనీ నిర్మాణానికి పునాదిరాయి పడలేదని తెలిపారు. ఇప్పుడు భూములను ఆనుకొని 516 జాతీయ రహదారి నిర్మించడంతో ఆయా భూములకు ధరలు పెరిగాయాని, దీంతో ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణం పేరుతో ఆయా భూమిని అమ్ముకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు జిందాల్ కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తుందని అన్నారు. దీనికి అధికార పార్టీ వత్తాసు పలుకుతూ. కంపెనీ నిర్మాణానికి భూములు ఇచ్చిన పేదలకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. అల్యూమినియం కంపెనీ నిర్మాణానికి రైతులు భూములు ఇచ్చారని, ఆ కంపెనీ నిర్మించనందున తిరిగి రైతులకు భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. తొలుత బొడ్డవర కూడలి నుండి జిందాల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఆందోళన నిర్వహించేందుకు బయలుదేరగా సిఐ వి అప్పలనాయుడు, ఎస్ఐ గంగరాజు తమ సిబ్బందితో కలసి అడ్డగించారు. దీంతో వారు జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చల్లా జగన్, గిరిజన జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మ అప్పలరాజు దొర, మురళీరాజు, రామ సత్యం, సన్యాసిరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

'ధాణాపురం' ఘటనపై డిజిపికి కెవిపిఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదోని మండలం, ధాణాపురం దళిత సర్పంచి చంద్రశేఖర్‌పై కులదురహంకారాన్ని ప్రదర్శించిన టిడిపి నాయకులు కృష్ణమ్మ, బిజెపి ఎమ్మెల్యే పార్థసారథిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డిజిపికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి ఆదివారం ఫిర్యాదు చేశారు. పార్థసారధి శాసన సభ్యత్వాన్ని రద్దుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. ఈ నెల 16న గ్రామంలో జరిగిన సభలో సర్పంచ్‌ను వేదికపైకి పిలవకుండా అవమానించడం బాధాకరమన్నారు. ఎస్‌సి కాబట్టి వేదికపైకి రాడని టిడిపి నాయకులు జి కృష్ణమ్మ చెప్పడం, ఈ వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించకుండా మిన్నకుండటం కులవివక్షను ప్రోత్సహించడం తప్ప మరొకటి కాదన్నారు. సర్పంచ్‌ను అవమానించిన ఘటనపై క్షమాపణ కోరిన ఎమ్మెల్యే పార్థసారధి, ఆ పేరుతో సర్పంచ్ మతాన్ని ప్రస్తావించడం మరింత దారుణమన్నారు. ప్రొటోకాల్ పక్కనపెట్టి కులాన్ని, మతాన్ని బట్టి ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధిని ఆహ్వానించే నిర్ణయించడం ఎమ్మెల్యే రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి మచ్చతేవడమేనన్నారు. క్షమాపణలో చిత్తశుద్ధి లేదని తెలిపారు. సిఎం దృష్టికి తీసుకెళ్లి సదరు ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు : సిపిఐ డిమాండ్

సర్పంచ్ కుల, మతాల గురించి ప్రస్తావించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ధాణాపురం గ్రామ సర్పంచ్ దళితుడనే కారణంతో వేదికపైకి పిలవకుండా అవమానించిన ఘటన దుర్మార్గమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనకు ఎమ్మెల్యే క్షమాపణలు చెబుతూ సర్పంచ్ మతం గురించి ప్రస్తావించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నాగరిక సమాజంలో బాధ్యతాయుత పదవిలో ఉండి కుల, మతాల ప్రస్తావన తెచ్చిన ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్‌వి జూలో చిరుత పులి మృతి

ప్రజాశక్తి- మంగళం (తిరుపతి)

మరణించిన మగ చిరుతపులి

అన్నవాహికలో ఆహారం అడ్డుపడడంతో చికిత్స పొందుతున్న మగ చిరుత పులి మరణించినట్లు ఎస్‌వి జంతుప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఇటీవల కర్నూలు జిల్లా ఆదోని సమీపంలోని కొసిగి ప్రాంతంలో సుమారు ఏడేళ్ల వయసున్న మగ చిరుత పులిని రక్షించి ఈ నెల 16న తిరుపతి నగరంలోని ఎస్‌పి జంతు ప్రదర్శనశాలకు తీసుకొచ్చారు. ఆ చిరుత గతంలో వేటాడి తిన్న ఆహారం అన్నవాహికలో అడ్డుపడింది. దాని చికిత్స నిమిత్తం రక్షించడానికి ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజేష్ నేతృత్వంలో హెల్త్ కమిటీ రేడియోగ్రఫీ, అల్ట్రా సోనోగ్రఫీ, శారీరక రసాయనాల పరీక్షలు నిర్వహించి వైద్యుల పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ చిరుత ఆరోగ్యం మరింత క్షీణించడంతో 21 సాయంత్రం మరణించింది. 22న ఎస్‌వి వెటర్నరీ విశ్వవిద్యాలయం పాథాలజీ విభాగం ప్రొఫెసర్ ఆధ్వర్యంలో శవ పరీక్ష నిర్వహించి చిరుత పులిని ఖననం చేశారు.

ఇ-వేలం - అమ్మకపు ప్రకటన

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (బ్యాంక్రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27 తో చదవగల ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ 2016 కింద

శ్రీ.మలిరెడ్డి కోటి రెడ్డి, నివాసం: ఇ.నెం.7-18/1, అల్లివీడు గ్రామం, విజయ్ రాయ్ పంచాయతీ, పెదవేగి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534001 యొక్క బ్యాంక్రప్టసీ ప్రక్రియలో

బ్యాంక్రప్టసీ ట్రస్టీ కార్యాలయం:
రాజేష్ చిల్లాలే, బి-725, వెస్ట్రన్ ప్లాజా, ఓయు కాలనీ, హెచ్ ఎస్ దర్గా, హైదరాబాద్- 500008
ఇమెయిల్: helapuri.pirp@gmail.com

బ్యాంక్రప్టసీ ఎస్టేట్‌లో భాగమైన బ్యాంక్రప్టసీ ప్రక్రియలో **శ్రీ.మలిరెడ్డి కోటి రెడ్డి** యొక్క ఈ క్రింది అసెట్స్ మరియు ఆస్తులను బ్యాంక్రప్టసీ ట్రస్టీ ద్వారా అమ్మకానికి ఉన్నాయి.

ఆస్తుల వివరణ	రిజర్వ్ ధర	ఈఎండి	బిడ్ పెంపు మొత్తం
రంగారెడ్డి జిల్లా, ఘట్కేసర్ మండలం, కొర్రెముల్ల గ్రామంలోని సర్వే నెం.353 & 354లో ఎక 11-34 గుంటల విస్తీర్ణం కలిగిన వ్యవసాయ భూమి మొత్తం మాలిరెడ్డి కోటి రెడ్డి పేరున ఉంది.	రూ.12.49 కోట్లు	రూ. 1.24 కోట్లు	రూ. 2 లక్షలు

1) అమ్మకం అననది "ఎక్కడ ఉందో అలాగే","ఏదో అలాగే", మరియు ఏదేని రికోర్స్ లేకుండా" ప్రాతిపదికన జరుగుతుంది.
2) అమ్మకం దిగువ సంతకందారు ద్వారా ఇ-వేలం ప్లాట్‌ఫామ్ (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో) ద్వారా జరుగుతుంది.
3) ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నియమ& నిబంధనల కోసం, ఆసక్తిగల దరఖాస్తుదారులు/పార్టీలు https://www.bankeauctions.com లో అందుబాటులో ఉన్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ పత్రాన్ని చూడవచ్చు లేదా బ్యాంక్రప్టసీ ట్రస్టీకి ఇమెయిల్ పంపడం ద్వారా పొందవచ్చు.
4) ఇ-వేలం వివరాల కోసం సంప్రదించండి: శ్రీ పి.ధరణి కుమార్, ఫోన్ నెం.99481822 22, ఇమెయిల్: telangana@c1india.com లేదా బ్యాంక్రప్టసీ ట్రస్టీ: helapuri.pirp@gmail.com
5) ఆసక్తిగల పార్టీలు / బిడ్డర్లు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లను సందర్శించి బిడ్‌ను సమర్పించాలని కోరడమైనది.
6) ఇ-వేలం యొక్క ఏవైనా నియమ& నిబంధనలను ఆమోదించు లేదా రద్దు చేయడానికి లేదా పొడిగించడానికి లేదా సవరించడానికి బ్యాంక్రప్టసీ ట్రస్టీకి హక్కు ఉంది.
7) బిడ్ పత్రాలను సమర్పించడానికి చివరి తేదీ మరియు సమయం: **07.07.2025 సా.5.00 గంటలు.**
8) ఈఎండి డిపాజిట్ చేయడానికి, సైట్ సందర్శన, పత్రాల లభ్యతకు చివరి తేదీ & సమయం: **07.07.2025 సా.5.00 గంటలు.**
9) దరఖాస్తుదారుల బిడ్ ఫారమ్ ధృవీకరణ మరియు అర్హత కలిగిన బిడ్డర్లకు ఐడిల కేటాయింపు మరియు పాస్‌వర్డ్‌లను తెలియజేయడం పూర్తిచేయు తేది: **08.07.2025**
10) ఇ-వేలం తేదీ మరియు సమయం: **09.07.2025 ఉ.11:00నుండి మ.1:00 గంటల మధ్య.**

సం/-
రాజేష్ చిల్లాలే
IBBI/IPA-001/IP-P00699/2017-2018/11226
శ్రీ. మలిరెడ్డి కోటి రెడ్డి యొక్క బ్యాంక్రప్టసీ ప్రక్రియలో బ్యాంక్రప్టసీ ట్రస్టీ

ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 23.06.2025

"పాతను బతికించటానికి కొత్త
చిట్కాలు వెతుకుతున్నారు.
కొత్తను హతమార్చటానికి
పాత కత్తులు నూరుతున్నారు."
– శ్రీశ్రీ



ముఖ్యంగా ...

బాబాలా బతకొద్దు
క్యాబాలా బతుకు!
వధశాల వైపు కాదు; ఈడ్వబడటం!
ఆశ్చర్యార్థకాల మధ్య
ప్రశ్నార్థకంగా కనిపించు!
ఆధిపత్య వర్ణాల అందచందాల్లో
ఓ బుగ్గ సిగ్గు మొగ్గ కాకుండా
దిష్టి చుక్కలా దివ్యంగా ప్రకాశించు!
ముగ్గెరగని.. వైట్ హౌస్ ముని వాకిలి ముందు
ఖాళీ సీసాల మధ్య దొర్లకు..
కలల నిండా.. కలహంసల కదలికలతో
కాలం రుణం తీర్చుకో!
చూడు.. ఇప్పుడు
ఎనిమిది గంటల పనిదినాల రక్తం
కార్పొరేట్ కనుసైగలతో ఇంకిపోతోంది!
విరామం లేని విశ్వ స్వేదం
అవిరామ జానపద బాణీ
నిష్కల్మష నాదంగా..
ఒక దగ్గర నిండీ.. ఒక దగ్గర ఎండీ..
కన్నీటి సింధులోయగా
రుద్దిన సింధూర పాయగా
మణిపూర్ణ నగ్న ధ్వని నడకగా
కుప్పం స్తంభానికి కట్టిన కప్పంగా
మొండి చేతుల జగన్నాథ రథం కదిలించే
బండబూతుల పండాల దండకంగా
బుద్ధ శుద్ధిని రక్త చందనాల అడవుల్లో
అభయారణ్యంగా తీర్చిదిద్దినట్టుగా
అరె.. అద్దినట్టుగా ఉందిరా!
నంబాళ్ల కేశవరావు కణతను పేల్చి నట్టుగా..
దిద్దినట్టుందిరా!
రేణుక రాసిన పచ్చగడ్డి కవిత్వంలా
నిన్నటివరకూ.. దేశభక్తి ముసుగులో
మతమొక ముఖం నీకు!
ఇరానీ.. టీ
ఇప్పుడు కషాయం!?
అన్నం కోసం.. అమ్మల కోసం
నీళ్ల కోసం.. చనుబాళ్ళ కోసం..
పరితపిస్తున్న పెదాల తరపున మాట్లాడుతున్నా ..
నీకు జీవితం కాదు;
జీతం కదా.. ముఖ్యం!?

– నల్లి ధర్మారావు
76609 67313

యుద్ధానికి మన వీలునామా

నిత్యం ఆరని ఆ ఎర్రని ఎగసిపడే నిప్పురవ్వలు
రగులుతున్న భూగోళం మధ్యలో
జరుగుతున్న యుద్ధానికి చిహ్నం
ఆ యుద్ధానికి
ఆవల నువ్వు ఈవల నేను
నువ్వు నేను ప్రేక్షకులం అనుకుంటున్నావేమో
ఆ యుద్ధం జరిగేది మన పేరుతోనే
కారణాలకేం
నీ శరీరానికి నా శరీరానికి మధ్య ఛాయ
నీ దేవుడికి నా దేవుడికి మధ్య రూపం
నీ కాళ్ళ కింద మట్టికి నా కాళ్ళకింద మట్టికి ఉన్న లోపలి సారం
అంతేగానీ
ఆయుధాలు అమ్ముకోవాలని
లక్షల ఏళ్ల కళేబరాల కమురు నుంచి పుట్టిన
చమురు కోసమని
పచ్చని గుట్టల కింద గుట్టుగా దాగిన ఖనిజాలపై కోరికని
పారదర్శకంగా పాలించే ఏ ప్రభువూ చెప్పడు!

ఏదైతేనేం?
యుద్ధ నేపథ్యం మాత్రం నీది నాది
నువ్వూ నేను ఎప్పటికీ కలుసుకోలేము
నువ్వూ నేను ఒకరి కొడుపులో ఒకరం
బాకులతో పొడుచుకోలేం
నువ్వా గడ్డపై నేనీ గడ్డపై ఉంటాం కానీ
ఆ యుద్ధానికి చిరునామా మనదే!
ఆ యుద్ధానికి వీలునామా కూడా మనదే
ఇది ఎప్పటికీ ఆగని వైరం
మనిద్దరి బలవంతపు సాక్షి సంతకం!

– బసు పోతన
9440878247

నేను అలా చేయలేను

వాళ్ల పథకాలకు భాష్యాలు రాసి
పాటలు అల్లి గొంతెత్తి పాడలేను
వాళ్లను కాపాడే రక్షణ కవచంలా
అక్షరాల అడ్డు నిలబడలేను
ప్రలోభాలకు తాకట్టు పడలేను
ఎంత మానసిక ఒత్తిడికీ గురిచేసిన
దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కాలం
వాంగ్మూలానికి సాక్షి సంతకం చేయలేను

ఏ ఎండకు ఆ గొడుగు పట్టలేను
అవకాశాన్ని లక్ష్యం చేసుకుని
మరుగుజ్జుగా బతుకలేను
వంకర రాతలు రాయలేను
చేయి అందించి ఒకరిని నడిపించే వేళ
మీరు చెప్పినట్టు ఆడించినట్టు ఆడలేను
కను సన్నల్లో కుప్పి గంతులు వేయలేను
నేను అలా తప్పటడుగులు వేయలేను

శూన్యమైన ఆచరణను కపటించలేను
అంతా మంచిదే అని ప్రకటించలేను
ఎప్పటికీ ప్రశ్నించడం ఆపలేను
నేను అలా ఎన్నటికీ చేయలేను
తప్పుడు కూతలు కూయలేను
తప్పుడు రాతలు రాయలేను
వెన్నెముక లేని అమీబాను కాలేను

– జూకంటి జగన్నాథం

వాడూ-నేనూ

బతుకు బాటలో వాడూ, నేనూ
పూలనేరుకుంటూ నేను
రాళ్ళనేరుకుంటూ వాడు
మజిలీ చివరలో
నా దోసిలి లో వాడిన పూలు
వాడి గుప్పెట్లో నాలుగు రాళ్లు
ఒకరినొకరు చూసి జాలి పడతాం
ఐతేనేం
నే కట్టిన పాటల్ని
వాడు కట్టిన కోటల్ని
ఒక్క ఉదుటున
దాటుకుంటూ పోతుంది కాలం
ఈజీగా..పక్క పేజీలోకి.

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931.

మైలపిల్లి మైరావుడి వీరగాథ



'సంఘటనలు కథలుగా మారకుండా చూసుకోవాలి. ఒకసారి కథలు అయ్యాయి అంటే రెండు సమస్యలు వస్తాయి. ఒకటి, కాదనలేవు. రెండు, నిరూపించలేవు. పేదరాశి పెద్దమ్మ ఒంగోని తుడుస్తా ఉంటే వీపుకి ఆకాశం తగిలేదంట. చీపురు, చాట ఎత్తి కొడితే ఆకాశం అంత ఎత్తుకి పోయిందంట. ఆ పెద్దమ్మ కథల కాణాచి' అని ప్రారంభమవుతుంది ప్రసాద్ సూరి నవల 'మైరావణ'

ఇది విశాఖ జిల్లా తీరప్రాంతాల్లో చేపలు పట్టే బెస్త వాళ్ళ జీవిత కథ. వాళ్లలో వాడ బలిజలు అనే కులం ఉంది. ముఖ్యంగా, ఇది వాళ్ళ జీవన పోరాటం. ఈ సమరంలో హీరో మైరావుడు. అతన్ని ఒక జానపద కథానాయకుడిని చేసి, అతన్నో గుర్రం ఎక్కించి, సముద్రతీరంలో, కొండ వాలుల్లో, పల్లెటూరి ప్రేమ గాలుల్లో కథను పరిగెత్తించాడు రచయిత. ఇది రచయిత సొంత కథ. తన బాల్యపు అడుగుజాడలివి. చదువు రాని తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు, వలలు అల్లడం, చేపలు పట్టడం... పేదరికంలోనే బతుకు తెల్లారిపోవడం, ధైర్యాన్ని కూడగట్టుకుని అక్కడే నిబ్బరంగా నిలిచి పోరాడటం – మన ముందు నిజాయితీగా పరుస్తాడు.

కథ చెప్పడానికి ఓ ప్రత్యేకమైన టెక్నిక్‌ని పనిగట్టుకుని వాడాడు. నాలుగు కథలను కలిపి ఒక గట్టి తాడును పేనినట్టుగా కథనం నడిపించాడు. వాడ బలిజల వెనకబాటుతనమూ, సాహసోపేతమైన దుర్భర జీవితం ఒకటి. కోరంగి, మోటుపల్లి లాంటి మన ప్రాచీన రేవుల్లో ఓడ నిర్మాణ సామర్థ్యమూ, అది క్రమంగా అంతరించిపోయిన విషాదమూ రెండు. బర్మాకి వలస వెళ్లిపోయిన వాడ బలిజల రాగ రంజితమైన రంగూన్ జీవితంలోని కన్నీటి వేదన మూడో కథ. దిగజారిన ప్రస్తుత రాజకీయాల నీచత్వాన్ని నిరసిస్తూ నడిచిన నాలుగో కథ.

మైరావణ వాస్తవానికి చాలా యాంబిషియస్ ప్రాజెక్టు. చరిత్ర, జీవితం, వలస, రాజకీయాలు అనే నాలుగు పాదాల మీద నవలని ఊపిరి సలపకుండా కదం తొక్కించిన తీరు పాఠకుణ్ణి ఆశ్చర్యపరుస్తుంది. తీరాన్ని తాకి, ఇసుకని పలకరించి, వేగంగా వెనక్కి వెళ్లిపోయే కెరటాల మీద మెరిసే నురుగులాంటి ప్రసాద్ సూరి వచనంలో మనం తడిసి ముద్దయిపోతాం. చక్కని తెలుగు రాస్తూనే, ఇంగ్లీషు పదాలు వాడుతూనే, ఉత్తరాంధ్ర బెస్తవాళ్ళ మాండలిక సొగసుని సంగీతంలా వినిపిస్తూ కవ్విస్తూ కథ నడిపిస్తాడీ ఈ కుర్ర రచయిత.

పూలని కూర్చినట్టుగా అందమైన పదాలని మాలకట్టడమేనా వచన రచన అంటే? కాదు కదా! దానికో తాత్విక నేపథ్యం ఉంది. మనం మర్చిపోవడానికి ఇష్టపడుతున్న మన చరిత్ర ఉంది. అడవిగాచిన వెన్నెల లాంటి నిరక్షరాస్యుల జీవన చిత్రణలోని నైపుణ్యం ఉంది. ఈ దుర్మార్గపు వ్యవస్థ అమానుషత్వం మీద కసిగా మారుతున్న కోపం ఉంది. ప్రొటెస్ట్ ఉంది. ఉపన్యాసం కాకుండా దానికి ఒక కళారూపం ఇచ్చే ప్రతిభ, నైపుణ్యం, విరుపూ, వెటకారం పుష్కలంగా ఉన్నాయి ప్రసాద్‌కి. మనల్ని వెంట లాక్కుపోయే తెలుగు పద సోయగంతో, విషయ వివరణల్లో, ఆలోచనాత్మక శిఖరాల్లో లోయల్లో, విశ్లేషణ వివేచనా, వివేకంలో మెరిసే సప్తవర్ణ మాలికల్లోని సౌందర్యం లాంటిదేదో ప్రసాద్ సూరి వాక్యంలో ప్రకాశిస్తూ ఉంటుంది. అలా దూకుడుగా రాస్తూనే, కొత్త విషయాలు చెబుతాడు. కొత్త తలుపులు ఏవో తెరుస్తాడు. వింత మాటల్ని పరిచయం చేస్తాడు. నాలుగు ఆలోచనాధారల్ని లాజికల్‌గా మెయిన్ స్ట్రీమ్‌లో కలిసే మేజికల్ విన్యాసాన్ని తన పొగరుబోతు వాక్యంతో పండిస్తాడు.

ఒకరోజు ఒక పెద్దచేప ఒక జాలరి వలలో పడింది. కాదు, అది నా వలలో పడింది... అంటూ ఇంకో జాలరి వచ్చాడు. నువ్వా? నేనా? అని గొడవ జరుగుతుంది. పంచాయితీ పెట్టారు. పంచాయతీ పెద్దలు ఎటూ తేల్చలేకపోతారు. అప్పుడు వాళ్ల మధ్య, తడి ఇసుక మీద మిలమిలా మెరుస్తున్న ఆ అందాల చేప చటుక్కున లేచి 'నన్ను పట్టింది మైరావుడే' అని చెప్పి పడిపోతుంది. పంచాయితీలో చేప మాటే నెగ్గుతుంది. అది మనందరికీ నచ్చుతుంది. చేప మాట్లాడడం ఏంటి! అని తర్కానికి పాల్పడం. అది ఒక జానపద సాంప్రదాయం కదా! అనుకుంటూ మనం కన్విన్స్ అవుతాం. ప్రసాద్ సూరి అప్రతిహత వచన యాత్రలో ఇలాంటి చమత్కారాలెన్నో రసానందపు ఆవలి తీరానికి మనల్ని చేరుస్తాయి. చేపల కూర తినడంలోని మజా, తాగుడు, తన్నుకోవడం, అక్రమ ప్రేమలూ, లేచిపోవడాలూ, గుండెలు ఆర్చుకుపోయేలా ఏడ్చినా తీరని వేదన, చీకటి తెరల్లోనే చితికిపోయిన బతుకుల్ని నెత్తురూ కన్నీళ్ళతో మాట్లాడించడం ఇతనికి ఒక సరదా మనకి మాత్రం అది నరకం.

• • •

నేను గాఢంగా మోహించిన సొలోమోన్ విజయ్ కుమార్ అనే దుమ్ము రేపే దళిత రచయిత ఈ పుస్తకానికి అర్థవంతమైన ముందుమాట రాశాడు. "బెస్తవారి నిజ జీవితాన్ని తెలుగులో ఈ నవలే తొలిసారిగా స్పష్టంగా చిత్రిస్తోంది. అపోహలు స్థిరపడి ఉన్న సమాజంలో చావుకు తెగించే వారి వేట జీవనాన్ని, కడుపు చేత పట్టుకొని బతికే వలస బతుకుని బయట ప్రపంచానికి తెలియని కోణాల నుంచి స్పష్టంగా చూపుతోంది ఈ నవల" అన్నాడు విజయ్ కుమార్. గుండె చెదిరే మునికాంతపల్లి కథల మొనగాడు ఈ ఇజీ కుమారే.

• • •

మైరావణ అనే 175 పేజీల నవల గురించి ఎందుకింత ఇష్టంగా, మురిపెంగా, ముచ్చటించుకోవాలంటే దానికో ప్రత్యేకమైన కారణం ఉంది. 2022 నవంబర్‌లో ఛాయా కృష్ణ మోహన్ బాబు ఈ నవలని ప్రచురించారు. ప్రసాద్ మొదటి నవల 'మై నేమ్ ఈజ్ చిరంజీవి' కూడా ఛాయా పబ్లిష్ చేసిందే.

మైరావణ రాస్తున్నప్పుడు, ప్రసాద్ సూరి 20 ఏళ్లు దాటి 21లో ప్రవేశిస్తున్న కుర్ర నాయాల. (ముద్దొచ్చినప్పుడు ఏలూరు నాయాళ్ళు అలాగే అంటారని, గమనించ ప్రార్థన) సముద్రపు లోతుల్లోంచి వెలికి తీసి, ఆ మృత్యు శీతల విషాదాన్ని కళ్ళ ముందు వాక్యాలుగా పరిచి, దాని ఆర్థిక, రాజకీయ, తాత్విక మూలాల్ని ఆత్రంగా వెతికి ... ఇదేనా బతుకు? ఇంత దరిద్రంగా బతకాలా? మనుషులకు ఈ దురవస్థ కలిగించింది ఎవరు? అని పగిలిన గుండెతో, పొగిలే కన్నీళ్ళతో 20 ఏళ్ల కుర్రాడు ప్రశ్నిస్తే మనకు ఎలా ఉంటుంది!

ఒకరకంగా అలెక్స్ హేలీ రూట్స్ లాగానే తన మూలాల్ని వెతుక్కుంటూ వెనక్కి వెళ్లి కన్నీళ్ళ పర్యంతం కావడమే 'మైరావణ'. నవల చివరలో ప్రసాద్ ఇలా అన్నాడు : "నా చిన్నతనం నుంచి నేను ఒక విషయం గమనిస్తూ ఉండేవాడిని. మేం వాడోళ్ళం – అంటే మా కులం పేరు వాడ బలిజ. విశాఖపట్నం సముద్రతీరం అంతా మా వాళ్లే, మా ఊర్లే. మా వృత్తి చేపలు పట్టడం. చేపలు పట్టే వాళ్ళని చాలా పేర్లతో పిలుస్తారు. ప్రధానంగా బెస్తలు, జాలర్లు అంటారు. కానీ, మా వాళ్లు తమని తాము వాడోళ్ళం అనే చెప్పుకుంటారు. మేము పూర్వకాలంలో ఓడలు తయారు చేసే వాళ్ళమని, ఏదో ఒక కాలంలో, చేపలు పట్టుకునే వత్తికి మారిపోయామని అంటారు. చేపలు పట్టుకోడానికి మారిపోయిన కాలం ఏమై ఉంటుంది? అని ఆలోచిస్తూ వెతుకుతూ ఉన్నప్పుడే ఈ మైరావణ నవల పుట్టిందన్నమాట.

ఇదొక Introspection ఇదొక Resurrection.

1955లో జవహర్ లాల్ నెహ్రూ నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణ ప్రారంభోత్సవానికి వస్తున్న సమయంలో, మాచర్లలో భారీఎత్తున డైనమైట్ స్టిక్స్ ఎందుకు దొంగిలించబడ్డాయి? గుండెలు అవిసిపోయే ఆ అద్భుతమైన కుట్రని, ప్రసాద్ తెలుసుకొని మనకు చెప్పిన తీరు ఏ సంచలన క్లైమాక్స్‌కి తక్కువది కాదు.

– తాడి ప్రకాష్
97045 41559

చందమామ లాంటి కథకుడు.. గంగిశెట్టి

అభినందన

పిల్లల బాధ్యత సమాజ బాధ్యత. వారు చక్కని కథలతో, కబుర్లతో ఆరోగ్యకరంగా ఎదగాలి. చక్కని సాంస్కృతిక వాతావరణంలో పెరగాలి. ఒకనాటి ఉమ్మడి కుటుంబాల్లో అమ్మమ్మ, నాన్నమ్మ చెప్పే కథలూ ముచ్చట్లూ వారిని తీర్చిదిద్దేవి. పెద్దల ద్వారా కథలు విన్న పిల్లలు తమకు తామే సొంతంగా కథలు చదవటంపై ఆసక్తి చూపిస్తారు. అలాంటి పిల్లలకు ఆసక్తికరంగా కథలను సృజియించే పనిని ఒక గురుతర బాధ్యతగా నిర్వహించిన, నిర్వర్తిస్తున్న రచయితలు ఎందరో! ఐదు దశాబ్దాలకు పైగా అలాంటి ఉత్తమమైన కృషి చేసిన బాల సాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్. ఆయన రాసిన 'కబుర్ల దేవత' కథల పుస్తకానికి ఈ ఏడాది కేంద్ర అకాడమీ బాల సాహిత్య పురస్కారం లభించింది.

నెల్లూరు జిల్లా రాపూరు గ్రామంలో జన్మించిన గంగిశెట్టి శివకుమార్ ఒక బాల సాహిత్య వేత్తగా ఎలా ఎదిగారు? కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరకు ఎలా చేరుకున్నారు? వెనుక ఎంత కృషి ఉంది? సమాజం మీద, బాల సాహిత్యం పట్ల అవగాహన ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయి? తెలుసుకోవటం ఆసక్తికరంగా ఉంటుంది.

శివకుమార్ తండ్రి పోస్ట్ ఆఫీస్‌లో చిరుద్యోగి. కానీ వారికున్న ఒకే ఒక్క అలవాటు చందమామ, బాలమిత్ర చదవటం. అదే గంగిశెట్టి రాతలనే కాదు, తలరాతను కూడా మార్చింది. పదమూడో ఏట నుంచి తానూ ఆ పుస్తకాలు చదవడం ప్రారంభించారు. స్నేహితులతో, తరగతుల్లో ఉన్న అవగాహనతోనే 14వ ఏట నుంచి కథలుగా రాయటం ప్రారంభించారు. అలా మొదలై... 71 సంవత్సరాల వయస్సు పైబడినా, 56 ఏళ్లుగా కేవలం బాల సాహిత్యం మీదనే కషి చేస్తున్నారు. దీనికి కొడవటికంటి కుటుంబరావు గారి ప్రోత్సాహం, చందమామ పత్రిక ఇచ్చిన ఆదరణ మూలస్తంభాలుగా చెప్పవచ్చు.

శివకుమార్ బాల సాహిత్యం మీద ఎస్వీ విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ చేస్తున్న దశలో అనుకోకుండా మద్రాస్ వెళ్ళటం, చందమామ ఆఫీసులో కొడవటిగంటి కుటుంబరావు గారిని కలవడం జరిగింది. గంగిశెట్టిని చూసిన కొకు "నీ కథలను చూసి చాలా పెద్దవారేమో అనుకున్నాను" అంటూ భుజం తట్టి ప్రోత్సహించారు. మెలకువలు చెప్పి వారి సాహిత్యానికి నూతన ఒరవడి ఏర్పరిచారు. అప్పట్లో చందమామ వారు కథకు 20 రూపాయల పారితోషికం పంపించేవారు. అప్పట్లో అది పెద్ద మొత్తం కింద లెక్క. కథలు రాస్తూ, ప్రతి నెలా అందే పారితోషికాలతో శివకుమార్ రెండేళ్ల తన అవసరాలు తీర్చుకోగలిగారు. తర్వాత కాలంలో 1980–82లో అదే చందమామలో ఉప సంపాదకుడిగా పనిచేశారు ఆయన. "ఆ రెండేళ్ల అక్కడ పనిచేయడం ద్వారా నేను సాహితీపరంగా మరింత ఎదిగానని చెప్పవచ్చు." అంటారు శివకుమార్.

ఉప సంపాదకుడిగా కొన్ని వేల కథలు చదవటం ఎంతో అవగాహన పెంచుకోవటానికి ఉపయోగపడింది. కొడవటిగంటి కుటుంబరావు గారి నేతృత్వంలో పనిచేయడం ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవటానికి దోహదపడింది. మూఢ నమ్మకాలు, మంత్రాలు, తాయత్తులు లాంటి జోలికి పోకుండా ముఖ్యంగా పిల్లల్లో సామాజిక మార్పుతో పాటు మానవీయ సంఘటనలు, మంచి చెడు తెలియజేపే కథలు అవసరమని శివకుమార్ చెబుతారు. అది చందమామ ద్వారా కొడవటిగంటి దిద్దిన ఒరవడి. కథల ద్వారా బాలబాలికల్లో గొప్ప పరివర్తన, వ్యక్తిత్వ నిర్మాణం సాధించవచ్చని అంటారు.

శివకుమార్ తరువాతి కాలంలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఉపాధ్యాయుడిగా ఉంటూనే వందలాది కథలు రాశారు. బాలసాహిత్యానికి సంబంధించి 40 పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయన రాసిన పలు కథలు ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో ప్రాథమిక విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డునందుకున్న డా.గంగిశెట్టి, దాదాపు 58 ఏళ్ళుగా బాలసాహితీ రంగంలో లబ్ధప్రతిష్ఠులయ్యారు. పలు ప్రముఖ పత్రికల్లో ఆయన బాలల కథలు నేటికీ ప్రచురితమవుతూనే ఉన్నాయి. బాల సాహిత్యంలో తనదంటూ విశేషమైన కృషితో ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. ప్రభుత్వ టీచరుగా ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఇప్పటికీ బాల సాహిత్యంలో అదే కృషి సాగిస్తున్నారు.

ఇప్పుడు సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. కొన్ని దుష్ప్రభావాలు పిల్లలపై పడి, వారి ఆలోచనల్లో మార్పు రావడం, విపరీత ధోరణులు ఏర్పడటం చూస్తున్నాం. టీచర్ల మీద దాడులు, పాఠశాలలో గొడవలు చాలాచోట్ల జరుగుతున్నాయి. ఈ సమస్యలను పైపైన చూస్తే సరిపోదు అంటారు శివకుమార్. పిల్లలకు చిన్నప్పటి నుంచి స్వేచ్ఛ, విలువలు, ఆటపాటలుచ కథలూ కబుర్లతో కూడిన విద్యాబోధన జరగాలి అంటారు. ఇప్పుడు పిల్లలకు కథలు చెప్పే వాతావరణం లేదు. ప్రయివేటు పాఠశాలల్లో ఆటస్థలాలు లేవు. మార్కులు, ర్యాంకుల మధ్యనే విద్యాబోధన సాగుతోంది. ఇక పిల్లల్లో వికాసం ఎలా ఏర్పడుతుంది? సమతా ధోరణి ఎప్పుడు అలవడుతుంది? అందుకనే బాల సాహిత్యం అవసరం ఎప్పటికన్నా ఇప్పుడు ఎక్కువగా ఉంది. బాల సాహిత్యమే అందరికీ ఆయుధం కావాలి. తల్లిదండ్రుల్లో కూడా మార్పు రావాలి. పిల్లలకు కథలు చెప్పాలి. చెప్పే తీరుబడి లేకపోతే కథల పుస్తకాలు చదివించాలి. తరగతుల్లో కూడా తప్పనిసరిగా కథలు చెప్పాలి. అది మొక్కుబడిగా ఉండరాదు. ఇలాంటి మార్పులు రానిదే సమాజంలో మంచి మార్పు ఆశించలేం. అందుకే బాల సాహిత్యం ప్రధానమైన అంశంగా రూపుదిద్దుకుంది. "నాకు ఇప్పుడు కేంద్ర సాహిత్య బాల సాహిత్య పురస్కారం లభించటం ఆనందమే అయినా... భాష సాహిత్యం పిల్లలకు చేరువ కావాలి. తద్వారా సమాజంలో ఆశించిన ఫలితాలు వచ్చిననాడు అవార్డుకు సార్థకతగా భావిస్తాను" అంటారు డా. గంగిశెట్టి శివకుమార్.

– ఈతకోట సుబ్బారావు
94405 29785

జీవిత తత్వాన్ని ఒంపిన 'తత్త్వనది'

పుస్తకం

జీవిత తత్వాన్ని ఎరిగినవారు నిశ్చలమైన మనసుతో నిబ్బరంతో జీవిస్తారు. నలుగురికి ఆదర్శంగా నిలబడతారు. అలాంటి జీవిత తత్వాన్ని తన కవిత్వంతో నలుగురితో పంచుకుంటున్నారు కవి మెట్టా నాగేశ్వరరావు. తన కవిత్వంలో అనేక జీవిత పార్శ్వాలపై తనదైన దూరదృష్టిని కలిగి మనకు జీవిత సారాన్ని బోధిస్తున్నట్టు కనబడుతుంది. తాను తాజాగా వెలువరించిన కవితా సంపుటి 'తత్త్వనది' చదివితే– హృదయాన్ని ఎలా శుభ్రపరచుకోవాలో తెలుస్తుంది.

జీవితం ఎంత ముఖ్యమో ఆ జీవితంలో తనకి కవిత్వం కూడా అంత ముఖ్యమే అంటాడు ఈ కవి. తనని 'సున్నా నుండి లక్షల సలక్షణుణ్ణి చేసింది కవిత్వమే' అని చెబుతూ కవిత్వమే తనకు తోడు లేకుంటే 'జాతరలో తప్పిపోయిన పసిపిల్లాడినే' అంటాడు. 'చిరంజీవి కవిత్వమే' అనే కవితలో 'కవిత్వాన్ని చదువుతూ/ కవిత్వపు తోటలో విహరిస్తూ/ రేపవలూ కవిత్వంతో పూరిస్తూ/ భూమ్మీద మోక్షాన్ని/ చవి చూస్తోన్న సంతృప్తిని నేను!' అంటాడు.

'ఆమెకే సాధ్యాలు' కవితను చదువుతుంటే గుండె బరువెక్కుతుంది. స్త్రీ ఎన్ని విధాలుగా కుటుంబాన్ని తన మనసు రెక్కల కింద దాచుకుంటుందో, ఆ దాచుకోవడంలో తాను ఎంత ఇబ్బందులకు గురవుతుందో తెలియజేస్తుంది. 'జీవిత కాలపు అయిష్టాన్ని కన్నోళ్ల కోసం/ దుఃఖాన్ని దిగమింగుతూనే/ సూర్యుళ్లను చిరునవ్వుతో పలకరించడం ఆమెకే సాధ్యం'. కుటుంబం కోసం నిత్యం స్త్రీ త్యాగాలనే తన నిలయంగా చేసుకుంటుంది. తనకు ఎన్ని శారీరక మానసిక ఇబ్బందులకు గురవుతున్న సంతోషంగానే స్వీకరిస్తుంది. దారి వెంబడి, ఆఫీసులలో ఎన్నో ముండ్ల చూపులను, వెకిలి మాటలను దాటుకొని కుటుంబం కోసం నిలబడడం అది ఆమెకు మాత్రమే సాధ్యం. ఆమె తలుచుకుంటే అన్ని సాధ్యమే ఒకటే ఆమెను చూసే మనలోని చెడుని బయటకు గెంటించడమే మనం చేయాల్సింది అంటూ కవితను ముగిస్తాడు. 'వాళ్ళ పాదాలకు నమస్కరిద్దాం రండి!' కవిత చదువుతున్నప్పుడు స్త్రీ యొక్క ఔన్నత్యం కనిపిస్తుంది. 'పురుషులు చచ్చుబడిన తావుల్లో/ బాధ్యతను కొండలా మోసే వనితలున్నారు/ వాళ్లు మట్టిఘనతలు/ వాళ్ల పాదాల బురదను ఎప్పుడైనా తాకావా/ అక్కడ స్త్రీల ఉదాత్తత వుంది'. ఇక్కడ స్త్రీ అంటే అబల కానే కాదు కుటుంబం కోసమే ఏదైనా చేయగలిగే ధీరవనితనీ అందుకే తనను తాను మలుచుకుని జీవిత తత్వన్నీ ఇముడ్చోగలదని చెప్పవచ్చు.

మనిషి భౌతిక సౌందర్యానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తుంటారు. కానీ సౌందర్యం అంటే మనసుని తన వైపు లాక్కునే భౌతిక సౌందర్యం కాదేమో అనిపిస్తుంది ఈ కొన్ని పాదాలను గమనించినప్పుడు. 'సోకు సోకు పాదాలు' అనే కవితలో 'దుఃఖమున్న చోటికి నడిచి వెళ్లే కాళ్లది అందం/ మనసు బాధని తుడిచే చేయి చలువ అందం/ కాలిలేని పిట్టని చూసిన కళ్ళది/ దాని తొవ్వలో గింజలు పోసినప్పుదందం/ సోకు కండలు తిరిగిన కాయానిధి కాదు/ గుండెల ఊపిరికి సంతోషాలు పూసే వ్యక్తిత్వానిదే'. దేహ సౌందర్యం ఎప్పుడో ఒకప్పుడు క్షీణించిపోతుంది అదే ఆత్మ సౌందర్యమైతే ఎప్పటికీ ఉంటుందనే తాత్వికతనీ తెలియజేస్తూ 'సోకు భౌతిక జాగాలను దాటాలి/ అంతర్జాగాలో పొందిన ఆలౌకికానందమే సోకంటే'.. అనే ముగింపు ఇస్తాడు. ఈ తత్వాన్ని ఎప్పుడైతే మనలో నింపుకుంటామో మన ఆత్మ సౌందర్యం మరింత రెట్టింపు అవుతుంది. 'ఒంటరి చీకట్లకాలం' అనే కవితలోకి వెళితే 'చీకటి అంటే వెలుగు లేకపోవడం కాదు/ ఎన్ని యేండ్లు బతికినా విలువ లేకపోవడం' అంటాడు. 'నేను ఏకవచనాన్ని కాదు / ఎప్పుడూ బహువచనాన్ని/ నాలో నేనులెన్నో.. ఇక్కడ బహువచనం గురించి మాట్లాడుతున్నప్పుడు మనిషిలోని అనేక భిన్న కోణాలను అనగా ఒక్కొక్క సందర్భంలో తాను ప్రవర్తించే, అనుసరించే విధానం గురించి మాట్లాడుతున్నాడు కవి. అందుకే 'నేనొక పూర్ణం కావాలంటే/ నేనుగా కాదు, ప్రకృతిగా మారిపోతాను' అని చెపుతాడు. మనిషి పూర్ణంగా ఎప్పుడు మారతాడు అదొక తత్వం. ఆ తత్వం ఎప్పుడు బోధపడుతుంది మనసు అనేది స్థిరత్వం కలిగి ఒక కొండలాగా తుఫాన్లు కూడా సైతం చెక్కుచెదరకుండా ఉండగలిగే అంత స్థిరత్వం గల మనసుని నిలుపుకున్నప్పుడు మాత్రమే. ఆ తాత్వికతను మనలో ఏర్పరచుకోవాలంటాడు కవి 'అనేక 'నేను' ల్లోకి'.. అనే కవితలో.

'చాకలోళ్ళ గాడిదలు' కవితలో గాడిదని ఎంత సౌందర్యంగా వర్ణించాడో చూద్దాం. ఇక్కడ 'బండమీద మెరిసిన వెన్నెల సాయంత్రమయేసరికీ/ గాడిదలనెక్కి సవారి చేసేవి... తానం చేసిన గాడిదలపై/ సందేళ సూరీడు టవలు తుడిచాకే కుంకుతాడు'. ఇక్కడ చాకలి వృత్తికి గాడిదక్కున్న సహాయ సహకారాలు ఎంతో గొప్పవి. చాకళ్ళయినా గాడిదలైనా/ శ్రమటోడ్చే బతుకుని యుద్ధమోలే గడుపుతారు. దేనిని కూడా తక్కువ చేసి చూడకూడదు అనే తాత్విక దోరని మనకు ఈ కవితలో కనబడుతుంది.

పరిణితి పరిణామాన్ని ఎరుకేజేసే/ గొంగళి పురుగు నా తత్వశాల (తత్త్వనది). ఇక్కడ జీవితంలోని కష్టసుఖాలను ఎలా ఎదుర్కోవాలి అనే దాన్ని గురించి ఒక గొంగళి పురుగు యొక్క జీవితాన్ని ఉదాహరణగా తీసుకురావడంలోని తాత్వికతను మనం అర్థం చేసుకున్నట్లయితే జీవితం ఎంతో నిర్మలం చేసుకోగలం. మనిషి తన జీవితంలోకి తాత్వికతను ఒంపుకోవాలి అంటాడు ఈ కవి. అలా జీవితంలోకి ఎప్పుడైతే తాత్వికత అనేది వచ్చి చేరుతుందో అప్పుడు మనసు నవ్వుల రోజులు పెరుగుతాయి అంటాడు. ఎప్పుడూ ఒకచోట ఉండొద్దు, సొంత కాళ్ల మీదే నడవాలి, మనిషి కదిలే నది లాగా సాగుతూనే ఉండాలి అంటాడు.

మెట్టా కవిత్వంలో బలమైన జీవితతత్వం, కవిత్వంలోని సాంద్రత కనబడుతుంది. తత్వబోధ తెలిసిన కవి నుంచి అభివ్యక్తమయ్యే కవిత్వం ఎంత సౌందర్యంగా ఉంటుందో ఈ కవిత్వంలో చూడవచ్చు. ఈ పుస్తకాన్ని చదువుతున్నంత సేపు మనలోని మనం చూసుకున్నట్టు, అంతరంగాన్ని పరిశీలిస్తున్నట్టు, సున్నితంగా మన మనసుకి తర్ఫీదు ఇస్తున్నట్టు అనిపిస్తుంది. రూ.260 వెల ఉన్న ఈ పుస్తకం కావలసినవారు 9951085760 సంప్రదించవచ్చు.

– గాజోజి శ్రీనివాస్
99484 83560

29న పలమనేరులో సాహిత్య సభ

చిత్తూరు జిల్లా సీనియర్ సాహితీవేత్త కే.శే. సి. వేణు గారి గురించి డాక్టర్ మధురాంతకం నరేంద్ర గారిచే స్మారక ఉపన్యాసం, పలమనేరు బాలాజీ రెండు పుస్తకాల పరిచయ కార్యక్రమం చిత్తూరు జిల్లా పలమనేరు, లయన్స్ క్లబ్‌లో జూన్ 29వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుంది. మధ్యాహ్న భోజనం తర్వాత రచయితలు, కవుల ఇష్టాగోష్ఠి ఉంటుంది. సి.భానుమూర్తి రెడ్డి, ఎన్.వేణుగోపాల్, ఆర్.ఎం.ఉమామహేశ్వర రావు, వి.ప్రతిమ, భూమన్, సుంకోజి దేవేంద్రాచారి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, వంగాల సంపత్ రెడ్డి, పల్లిపట్టు నాగరాజు, ఎండపల్లి భారతి, టి ఎస్ ఏ కష్ణమూర్తి తదితరులు పాల్గొంటారు.

– పలమనేరు బాలాజీ
94409 95010

జాతీయ స్థాయి జయప్రద, జమున అవార్డులు

ఏటా ఇస్తున్న జాతీయ స్థాయి జమున స్మారక నానీల సంపుటి అవార్డు, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నవలా అవార్డులకు ఈ ఏడాది కూడా ఎంట్రీలు ఆహ్వానిస్తున్నాం. 2024 జనవరి నుంచి డిసెంబర్ మధ్య ప్రచురితమైన నానీల సంపుటాలు, నవలలు 3 కాపీలు చొప్పున జూలై 31, 2025లోగా పంపాలి. నవల 300 పేజీల లోపు ఉండాలి. ఉత్తమ నానీల సంపుటికి రూ.10 వేలు, ఉత్తమ నవలకు రూ.15 వేలు నగదు పురస్కారం ఉంటుంది. వివరాలకు 85001 30770 నెంబర్లో సంప్రదించొచ్చు. ఎంట్రీలు పంపాల్సిన చిరునామా : అవ్వారు శ్రీధర్ బాబు, 23-1-57. పెండెం వారి వీధి, ఫత్తేఖాన్ పేట. నెల్లూరు – 524003.

– డా. పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి

29న రెండు పుస్తకాల పరిచయ సభ

ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు సిహెచ్ ప్రభాకరరావు జీవిత భాగస్వామి శ్రీమతి చిగురుపల్లి చంద్రకళ జ్ఞాపకంగా వెలువరించిన 'ఉరికంబం సాక్షిగా...', 'గీసి చెరిపే బొమ్మ' పుస్తకాల పరిచయ సభ ఈనెల 29 ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో జరుగుతుంది. 'ఉరికంబం సాక్షిగా..' భగత్ సింగ్ జీవితంపై వ్యాస సంపుటిని ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి పరిచయం చేస్తారు.

అగ్రరాజ్యం దుశ్చర్యపై సర్వత్రా ఆందోళన

- ఉద్రిక్తతలను నివారించాలని పలు దేశాల హితవు
- అమెరికా దాడులను ఖండించిన రష్యా, చైనా, క్యూబా, వెనిజులా
- సైనిక పరిష్కారం తగదన్న ఐరాస

న్యూఢిల్లీ : ఇరాన్‌పై అగ్రరాజ్యం దుశ్చర్యను పలు దేశాలు ఖండించాయి. ఈ దాడులతో ప్రాంతీయ ఘర్షణలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. దాడులకు స్వస్తి చెప్పాలని, ఉద్రిక్తతలను నివారించి దౌత్యపరమైన చర్చలు జరపాలని హితవు పలికాయి. ఇజ్రాయిల్, బ్రిటన్ ట్రంప్ చర్యను సమర్ధించాయి. ట్రంప్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని మధ్య ప్రాచ్యంలో నరమేధం సృష్టిస్తోన్న ఇజ్రాయిల్ కొనియాడింది. బలప్రయోగం ద్వారా మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరత సాధ్యపడుతుందని ప్రధాని నెతన్యాహూ చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ భద్రతకు ఇరాన్ అణు కార్యక్రమం తీవ్ర ముప్పు కలిగిస్తుందని బ్రిటన్ ప్రధాని స్టార్మన్ తెలిపారు. అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునేందుకు ఇరాన్‌ను అనుమతించకూడదని, ముప్పును తప్పించేందుకే అమెరికా ఈ చర్యకు దిగిందని అన్నారు. అమెరికా చర్యపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుట్టెరెస్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఘర్షణలు అదుపు తప్పే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు, మధ్యప్రాచ్యం, ప్రపంచం కూడా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉద్రిక్తతలను నివారించేందుకు సభ్య దేశాలు కృషి చేయాలి. సైనిక పరిష్కారం కూడదు. దౌత్యం ద్వారానే ముందుకు సాగాలి' అని సూచించారు.

అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే : రష్యా

ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఈ దాడులతో మధ్యప్రాచ్యంలో ఘర్షణల ముప్పు పెరుగుతుందని తెలిపింది. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకోవాలన్న అమెరికా బాధ్యతారాహిత్య నిర్ణయం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని రష్యా విదేశాంగ శాఖ విమర్శించింది. దుందుడుకు చర్యలకు స్వస్తి చెప్పి రాజకీయ, దౌత్య చర్యలు చేపట్టాలని కోరింది. ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా జరిపిన దాడులకు సంబంధించి డోనాల్డ్ ట్రంప్‌తో చర్చించాలని పుతిన్ కోరుకోవడం లేదని రష్యా స్పష్టం చేసింది. అన్ని పక్షాలు చర్చలకు రావాలని న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్ కోరారు. సైనిక చర్య కంటే దౌత్యమే మేలని చెప్పారు.

చర్చలకే ప్రాధాన్యత ఇవ్వాలి : చైనా

అమెరికా దాడులు ప్రమాదకరమైన మలుపు తీసుకున్నాయని చైనా వ్యాఖ్యానించింది. మధ్యప్రాచ్యంలో సైనిక జోక్యాలు అనుకోని పరిణామాలకు దారితీస్తాయని గత అనుభవాలు చెబుతున్నాయని, వీటివల్ల ఘర్షణలు దీర్ఘకాలం కొనసాగి ప్రాంతీయ అస్థిరతను సృష్టిస్తాయని చైనా ప్రభుత్వ విదేశీ భాషా ప్రసార విభాగం సిజిటిఎన్ వివరించింది. 2003లో ఇరాక్‌పై అమెరికా జరిపిన దురాక్రమణను ప్రస్తావించింది. సైనిక ఘర్షణ కంటే దౌత్య చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా మధ్యప్రాచ్యంలో సుస్థిరత ఏర్పడుతుందని తెలిపింది.

దౌత్య కార్యాలయాన్ని మూసేసిన ఆస్ట్రేలియా

టెహ్రాన్‌లోని తన దౌత్య కార్యాలయాన్ని ఆస్ట్రేలియా మూసివేసింది. సిబ్బందికి అక్కడి నుండి ఖాళీ చేయించింది. ఘర్షణకు దౌత్యపరమైన పరిష్కారం సాధించాలని సూచించింది. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమం అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు ముప్పు కలిగిస్తుందని అంటూ ఉద్రిక్తతలను తగ్గించుకొని దౌత్యం, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ఇరు దేశాలకు సూచించింది. జపాన్ ప్రధాని షిగేరు ఇస్షిబా తన క్యాబినెట్ సహచరులతో సమావేశమై అమెరికా దాడుల ప్రభావంపై చర్చించారు. అమెరికా దాడుల కారణంగా భద్రత, ఆర్థిక పరంగా ఎదురయ్యే పరిణామాలపై చర్చించేందుకు దక్షిణ కొరియా అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు తక్షణమే దౌత్య చర్చలు ప్రారంభించాలని మెక్సికో కోరింది.

అమెరికా దాడులు ఆపాలంటూ ఫిలిప్పైన్స్‌లోని క్యూజోన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నిరసనకారులు

శత్రుత్వానికి స్వస్తి చెప్పండి : వెనిజులా, క్యూబా

అమెరికా సైనిక చర్యను వెనిజులా ఖండించింది. శతృత్వానికి వెంటనే స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చింది. క్యూబా అమెరికా దాడులను తప్పుపట్టింది. ఈ దాడులతో మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రమాదకరంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా చర్య ఐరాస ఛార్టర్‌ను, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని, మానవతను సంక్షోభంలోకి నెట్టి తీవ్ర పరిణామాలను కలిగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

అణు వివాదానికి చర్చలే పరిష్కారం

ఇరాన్‌లో ఉద్రిక్తతలు పెరగడంపై ఈజిప్ట్ ఆందోళన వ్యక్తం చేసింది. అవి మధ్యప్రాచ్యంలో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని తెలిపింది. ఆ ప్రాంతంలో మరింత గందరగోళ, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. సంయమనం పాటించాలని, ఇరు పక్షాలు చర్చలు జరపాలని ఫ్రాన్స్ కోరింది. అమెరికా దాడులు ఉద్రిక్తతలను మరింత పెంచుతాయని, అస్థిర పరిస్థితులు ఏర్పడతాయని తుర్కియే తెలిపింది. అన్ని పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి దాడులకు వెంటనే స్వస్తి చెప్పాలని కోరింది. ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న అణు వివాదాన్ని చర్చలే పరిష్కరిస్తాయని అభిప్రాయపడింది.

గ్వాలియర్‌లో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఎంఎ బేబీ, అరుణ్‌కుమార్ తదితరులు

అమెరికా దాడులు ఆటవికం... నేరపూరితం

- భారత్ వైఖరి స్పష్టం చేయాలి : సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ డిమాండ్
- గ్వాలియర్‌లో నిరసన ప్రదర్శన

గ్వాలియర్ : ఇరాన్‌పై అమెరికా దాడులను సిపిఎం తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఆటవికంగా, నేరపూరితంగా దాడులు జరిపిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా దాడులను నిరసిస్తూ మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఆదివారం జరిగిన భారీ ప్రదర్శనకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా దాడులపై మోడీ ప్రభుత్వ వైఖరి నిరుత్సాహకరంగా ఉన్నదని చెప్పారు. ఇప్పటి వరకూ భారత్ అవలంబిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి ఇది విరుద్ధమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను స్పష్టమైన పదజాలంతో ఖండించాలని డిమాండ్ చేశారు. భారత్‌తో ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, ప్రతి కష్ట సమయంలోనూ భారత్‌కు మద్దతు ఇస్తోందని గుర్తు చేశారు.

ఇరాన్ సార్వభౌమత్వంపై దాడి జరిగిన ప్రస్తుత సమయంలో ఆ దేశానికి అండగా నిలవాల్సిన అవసరం ఉన్నదని బేబీ స్పష్టం చేశారు. ట్రంప్ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా మోడీ ప్రభుత్వం ఇప్పుడు అమెరికా వైపు నిలుస్తోందని, తద్వారా అంతర్జాతీయంగా భారతదేశానికి ఉన్న విశ్వసనీయతను, కీర్తిని దెబ్బతీస్తోందని విమర్శించారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా కుంటిసాకులు చెబుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అణు బాంబు తయారు చేయలేదని, అసలు దానిని తయారు చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని అమెరికా ఇంటెలిజెన్స్ అధిపతి తులసీ గబ్బార్డ్ తొలుత మార్చిలో, ఆ తర్వాత మేలో ఆ దేశ పార్లమెంటేరియన్లకు చెప్పారని, ఈ నెల 17న కూడా అదే మాట చెప్పారని గుర్తు చేశారు. మరి అలాంటప్పుడు తాజా దాడులను ఎలా సమర్ధించుకుంటారని ఆయన ప్రశ్నించారు.

ఇరాన్ అణు బాంబును తయారు చేయడం లేదని, తన అణు శక్తి ఉత్పత్తి కేంద్రాలలో విచారణకు సహకరిస్తోందని రెండు రోజుల క్రితమే అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఎఇఎ) డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాస్సీ చెప్పిన విషయాన్ని కూడా బేబీ ప్రస్తావించారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై సైతం ఇరాన్ సంతకం చేసిందని గుర్తు చేశారు. దాని నుండి వైదొలుగుతున్నానని ఇరాన్ ఎన్నడూ చెప్పలేదని అన్నారు. అణు బాంబును తయారు చేయబోనని ఐరాసలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్‌తో కలిసి జెసిపిఓఎ ఒప్పందంపై సంతకం చేసి హామీ కూడా ఇచ్చిందని తెలిపారు. ఇరాన్ ఇప్పటికీ దానికే కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో ఇరాన్‌పై దాడి చేయడం మధ్య ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని విమర్శించారు. ఇరాక్ పైన కూడా అమెరికా, సామ్రాజ్యవాద శిబిరం ఇలాంటి అబద్ధాలే వల్లె వేసిందని బేబీ గుర్తు చేశారు. అక్కడి పురాతన నాగరికతను ధ్వంసం చేసిన తర్వాత తమకు తప్పుడు సమాచారం అందిందని అంగీకరించాయని చెప్పారు. ఇప్పుడు ఇరాన్ విషయంలో కూడా అలాగే వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా గాజాలో కొనసాగుతున్న మారణహోమాన్ని కూడా బేబీ ఖండించారు. అందులో మహిళలు, చిన్నారులు సహా అరవై వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పాలస్తీనా పక్షాన నిలవాలని భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దాడులకు వ్యతిరేకంగా గళం విప్పాలని ఆయన దేశ ప్రజలను కోరారు.

ప్రదర్శనను ఉద్దేశించి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్ కుమార్ మాట్లాడుతూ భారత విదేశాంగ విధానం ఎప్పుడూ యుద్ధాన్ని వ్యతిరేకిస్తుందని అన్నారు. ఇది యుద్ధానికి సమయం కాదని ప్రధాని నరేంద్ర మోడీ కూడా చెప్పారని అన్నారు. ఇప్పుడు ఆయన తన మాటకు కట్టుబడి ఉండాలని, ఇరాన్‌పై జరుగుతున్న దాడికి, పాలస్తీనాలో జరుగుతున్న మారణహోమానికి వ్యతిరేకంగా మాట్లాడాలని కోరారు. సిపిఎం మధ్యప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు జస్వీందర్ సింగ్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ సీనియర్ నేత గురు దత్ శర్మ కూడా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయించొద్దు

- లండన్ వీధుల్లో కదం తొక్కిన ప్రజలు

లండన్ : గాజాలో, ఇరాన్‌లో ఇజ్రాయిల్ చేస్తున్న మారణ హోమానికి వ్యతిరేకంగా లండన్‌లో ప్రజలు కదంతొక్కారు. పాలస్తీనాకు మద్దతుగా వేలాది మంది మార్చ్ నిర్వహించారు. ఇజ్రాయిల్ నరమేధాన్ని ఖండించారు. పాలస్తీనాలో ఆక్రమణలకు ఇజ్రాయిల్ ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై దాడులను ఇజ్రాయిల్ ఆపాలని డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు కారణమవుతున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయించడం ఆపాలని బ్రిటన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బ్రిటన్ ప్రధాని చేతులు రక్తంతో తడిసాయని నినాదాలు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. 'నేషనల్ మార్చ్ ఫర్ పాలస్తీనా' పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. సెంట్రల్ లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియంకు సమీపంలోని రస్సెల్ స్క్వేర్ నుంచి బ్రిటీష్ పార్లమెంట్‌కు ఆనుకొని ఉన్న వీధి వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ వీధిలోనే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఇతర ప్రముఖుల నివాసాలు ఉన్నాయి.

దాదాపు నాలుగు గంటల పాటు ఈ ర్యాలీ జరిగింది. ఇజ్రాయిల్‌కు విక్రయిస్తున్నందుకు, గాజాలో ఇజ్రాయిల్ హత్యాకాండను ఆపడానికి తక్షణ చర్యలు తీసుకోనందుకు బ్రిటన్ ప్రధాని చేతులు రక్తంతో తడిసాయని ప్లకార్డులు ప్రదర్శించారు. 'ప్రధాని.. మీరు.. సిగ్గుపడాలి' అని బిగ్గరగా నినాదాలు చేశారు.

అమెరికా దాడులపై వామపక్షాల ఖండన

(మొదటిపేజీ తరువాయి)

మిలిటరీ - పారిశ్రామిక ప్రయోజనాలు కాపాడి, తద్వారా ప్రస్తుతం కొనసాగుతున్న సుదీర్ఘ సంక్షోభం నుండి అంతర్జాతీయ పెట్టుబడిని గట్టెక్కించడానికే ఈ దాడి జరిగింది' అని వామపక్ష పార్టీలు ఆ ప్రకటనలో వివరించాయి.

'ఇరాన్‌పై బంకర్ విధ్వంసక బాంబులు వేసేందుకు అమెరికా బి-2 రహస్య బాంబర్లను మోహరించింది. ఇరాక్ దురాక్రమణ సమయంలో కూడా అమెరికా ఇలాగే ధ్రువీకరించుకోని వాదనలు చేసింది. అవి తప్పని ఆ తర్వాత తేలింది. రెండో ప్రపంచ యుద్ధం చివరలో చర్చలకు జపాన్ సిద్ధపడినప్పటికీ ఇప్పటి వరకూ అణ్వాయుధాలను ఉపయోగించిన ఏకైక దేశం అమెరికాయే. ఇప్పుడు ఆ దేశమే అణ్వాయుధ ముప్పు గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఏ విధంగా చూసినప్పటికీ అమెరికా దాడి ఘర్షణలను తీవ్రతరం చేస్తుంది. ప్రపంచ శాంతి పైన, సాధారణ ప్రజల జీవనోపాధి మీద వినాశకరమైన ప్రభావం పడుతుంది. ముఖ్యంగా చమురు దిగుమతుల కోసం, వలస కార్మికులకు అవకాశాల కోసం పశ్చిమాసియాపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్ వంటి దేశాలపై ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుంది. ఇప్పటికే బాగా ఇబ్బంది పడుతున్న కార్మిక వర్గం ఈ యుద్ధం కారణంగా ఆర్థికంగా మరింత దెబ్బతింటుంది' అని వామపక్షాల ప్రకటన తెలిపింది. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి యుద్ధాన్ని ఆపడానికి అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నా లలో భాగస్వామిగా చేరాలని వామపక్ష పార్టీలు సూచించాయి. సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యకు వ్యతిరేకంగా వెంటనే నిరసనలు చేపట్టాలని పార్టీ శాఖలకు పిలుపునిచ్చాయి. దేశంలో శాంతిని కోరుకునే ప్రజలంతా అమెరికా దాడిని ఖండించాలని కోరాయి.

ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు

(మొదటిపేజీ తరువాయి)

హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం – ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం రెండు కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యుఎఇ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్‌ఎన్‌జి కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

భారత్ పైనా ప్రభావం

భారత్ తన అవసరాల్లో 90శాతం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అందులో 40శాతం హర్మోజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. ఇరాన్ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువపైనా ప్రభావం చూపిస్తుంది.

JM FINANCIAL Home Loans
జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: 3వ అంతస్తు, సుఆసిష్ ఐటి పార్కు, ప్లాట్ నం. 68ఇ, ఆఫ్ దత్తా పాద రోడ్, టాటా స్టీల్ ఎదురుగా, బోరివాలి (ఈ), ముంబయి-400 066.

డిమాండ్ నోటీసు

(ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 20020 యొక్క సెక్షన్ 13(2) క్రింద)

ఏదైతే, క్రింది సంతకందారు, జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ (జెఎంఎఫ్‌హెచ్‌ఎల్) యొక్క అధీకృత అధికారిగా, చట్టం క్రింద మరియు రూల్స్ యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినిగించుకొని, ఇప్పటికీ వివరణాత్మక దిగువ తేదీ నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద, రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులును (వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఇందు జాబితాలోని "ఒబ్లిగర్స్")/ చట్టబద్ధ వారసులు/ ప్రతినిధులు, సదరు డిమాండ్ నోటీసు లో పేర్కొన మొత్తాలను సదరు నోటీసు తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం, సదరు నోటీసుల కాపీలను రిజిస్టర్డు పోస్టు ద్వారా జారీచేయబడినవి మరియు క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటాయి. మరియు వాటిని కార్యాలయ పనివేళల్లో ఏ సమయమునైనా క్రింది సంతకందారు నుండి పొందవచ్చును.

పైదానికి సంబంధించి, ఇందుమూలంగా మరోసారి నోటీసు ఇవ్వడమేమనగా, సదరు ఆబ్లిగేటర్స్/ చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతనిధులు, జెఎంఎఫ్‌హెచెఎల్‌కు సదరు నోటీసుల్లో గల తేదీ నుండి 60 రోజుల్లోగా, ఇందు వారి పేర్లకు ఎదురుగా దిగువ పేర్కొన్న మొత్తాలను సదరు తేదీ నుండి రియలైజేషన్/ చెల్లించు తేదీ వరకు దిగువ వివరించిన తదుపరి వడ్డీతోసహా, ఇతర పత్రాలు/ వ్రాతలు మరియు రుణ ఒప్పందం తో చదువుతూ, సదరు బాధ్యుడుచేత నిర్వహించిన ఏవేని, రుణ బకాయిని తిరిగి చెల్లించుట కొరకు హామీగా సదరు బాధ్యులు చేత జెఎంఎఫ్‌హెచ్‌ఎల్‌కు తాకట్టుపెట్టిన దిగువ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోగలరు.

క్ర. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు & హామీదారుల పేరు & ఎల్ఎఎన్	ఆస్తి వివరణ	13(2) నోటీసు తేది, ఎన్‌పిఏ తేది, తేదీ నాటికి బకాయి మొత్తాలు
1	1. శ్రీ బొల్ల రామ్ ప్రసాద్, 2. శ్రీమతి బొల్ల నాగలక్ష్మి, రుణ ఖాతా నం. HVIJ23000043465 & LVIJ23000043471	ఇంటి నంబరు 2-46, రీ సర్వే నంబరు: 87/2, వీరంకి (గ్రామం), పమిడిముక్కల (మండలం), వుయ్యూరు సబ్-రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. 521250. సరిహద్దులు: **తూర్పు:** పంచాయతి బాజారు, దక్షిణం: ఉమ్మడి బాజారు, పడమర: తలం పకీర్ ఆస్తి, ఉత్తరం: ఆరెపల్లి అంజయ్య ఆస్తి. పై సదరు సరిహద్దుల్లో అన్ని ఈజిమెంట్ హక్కులతోపాటు 185చ.గ.ల విస్తీర్ణం.	1.06.06.2025, 2.04.06.2025, 3. 06 జూన్ 2025 నాటికి బకాయి రూ. 12,60,457/- (రూపాయలు పన్నెండు లక్షల అరవై వేల నాలుగు వందల యాభై ఏడు మాత్రమే).
2	1. శ్రీ పోతరాజు రఘు రామ శేషు, 2. శ్రీమతి పోతరాజు భవాణి, రుణ ఖాతా నం. HVIJ22000029260	**ఐటెం: 1:** కృష్ణా జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, కానూరు గ్రామపంచాయతి ఏరియా, కానూరు గ్రామం, ఆర్ఎస్ నం. 26/3లో డోర్ నం.18-178 దగ్గరలో 288.0చ.గ.లకుగాను 28.0 చ.గ.ల విస్తీర్ణంతో విడదీయలేని& సూచించజాలని ల్యాండ్ ఆస్తి. సరిహద్దులు: తూర్పు: నిడుమోలు మస్తానమ్మ ఆస్తి 32.7అ.లు, దక్షిణం: రాజనాల ఉమా మహేశ్వర రావు ఆస్తి 79.7అ.లు, పడమర: 33' అ.ల వెడల్పు పంచాయతి రోడ్ 32.7అ.లు, ఉత్తరం: మహ్మద్ అమానుల్లా & విన్నకోట గంగాధర రావు ఆస్తి 79.7అ.లు. **ఐటెం: 2:** పై ఐటెం-1 నుండి, శ్రీ వేంకటేశ్వర రెసిడెన్సీ, ఫ్లాట్ నం. ఎస్ఎఫ్-2, రెండవ అంతస్తు, 750చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగి, 100చ.అ.ల ఉమ్మడి ఏరియా, 80చ.అ.ల పార్కింగ్ ఏరియా అన్ని ఈజిమెంట్ హక్కుతోసహా. సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి కారిడార్, లిఫ్టు మరియు మెట్లు, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-1 మధ్య ఉమ్మడి గోడ, ఉత్తరం: ఒపెన్ టు స్కైకు ప్రక్కన బాల్కనీ.	1.06.06.2025, 2.04.06.2025, 3. 06 జూన్ 2025 నాటికి బకాయి రూ. 29,65,391/- (రూపాయలు ఇరువై తొమ్మిది లక్షల అరవై ఐదు వేల మూడు వందల తొంబై ఒకటి మాత్రమే).

పై పేర్కొన్న తేదీ నాటి సదరు డిమాండ్ నోటీసులో చూపిన మరింత వివరాల రేటుతో చెల్లించు తేదీ వరకు తదుపరి వడ్డీ, అదనపు వడ్డీతో, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు **తో**. ఒక వేల సదరు బాధ్యులు పై చెప్పినట్లు జెఎంఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్ కు చెల్లింపులుచేయుటలో విఫలంచెందిన, అప్పుడు జెఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించబడు రూల్స్ క్రింద సదరు బాధ్యులు/ చట్టబద్ధ వారసలు/చట్టబద్ధ ప్రతినిధులు పూర్తి బాధ్యత పైననే, పై సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తుల పై చర్యలు తీసుకొందురు.

సదరు బాధ్యులు/ చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధులు జెఎంఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్ యొక్క ముందస్తు వ్రాతపూర్వ అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా రూపాలలో పై సదరు సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తులను బదిలీచేయుట నుండి చట్టం క్రింద నిషేదింపబడినారు. ఎవరైనా వ్యక్తి చట్టం లేదా రూల్స్‌ను ఉల్లంఘించిన పక్షంలో జైలు శిక్ష మరియు/లేదా జరిమానాకు బాధ్యులగుదరు.

ప్రదేశం: విజయవాడ, తేది: 23.06.2025 — సం/- అధీకృత అధికారి, జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్.

GRIHUM HOUSING FINANCE
గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, బి బిల్డింగ్, గంగ ట్ర్యూనో, లోహెగావ్, పూణె, మహారాష్ట్ర-411014.
అనుబంధం IV (రూల్ 8(1) చూడండి) స్వాధీనత నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ తో విలీనం చేయబడింది) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "సదరు చట్టం"గా సూచించబడుతుంది) మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, పైన కార్పొరేట్/నమోదిత కార్యాలయం యొక్క ఇకపై సెక్యూర్ క్రెడిటార్‌గా సూచించబడే ఆధీకృత అధికారి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీతలను పిలుస్తూ దిగువ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తిని 23 జనవరి, 2024న దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది.

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను. సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్తి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర. సం	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	డిమాండ్ నోటీసు చట్టబద్ధత తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
1	తాడిగిరి శ్రీనివాసరావు, తాడిగిరి నాగార్జున కుమార్, తాడిగిరి జ్ఞానమ్మ, తాడిగిరి శివకృష్ణ, తాడిగిరి హరికృష్ణ	పల్నాడు జిల్లా, గుంటూరు ఆర్.డి., ఫిరంగిపురం ఉపజిల్లా, సొలస గ్రామ పంచాయతీ, సొలస గ్రామం, సర్వే డో.నం.459, మూల్యాంకనం నం.1030, డో.నం.3-30 విస్తీర్ణం 102 చ.గ.లు. ఆర్‌సిసి డాబా ఇల్లు. ఉన్న హద్దులు : సరిహద్దులు : ఉత్తరం : మేడిద శిరీష ఆస్తి 37-7 అ.లు., తూర్పు : పంచాయతీ బజారు 24-4 అ.లు., దక్షిణం : తాడిగిరి రాజు ఆస్తి 37-7 [illegible]	17/06/2025	09/04/2025	Loan No. LAP02192000000005028283 రూ.7,35,906/- (ఏడు లక్షల ముప్పై ఐదు వేల తొమ్మిది వందల ఆరు రూపాయలు మాత్రమే) 09.04.2025 నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు [illegible]
2	[illegible]	[illegible]	17/06/2025	09/04/2025	Loan No. LAP02192000000005021921 రూ.18,47,165/- [illegible] Loan No. HF0219H19100015 రూ.13,70,704/- [illegible]
3	[illegible]	[illegible]	17/06/2025	09/04/2025	Loan No. HL00053100000005004153 రూ.26,66,996/- [illegible]

ప్రదేశం : గుంటూరు, తేది : 23.06.2025 — సం/- అధీకృత అధికారి, గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలవబడింది)

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
లీగల్ డిపార్ట్‌మెంట్, నెం.145, 3వ అంతస్తు, శాంత్రోమ్ హై రోడ్, (3వ అంతస్తు), మైలాపోర్, చెన్నై-600004. ఫోన్: 044-46068200

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారులు **మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్** యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు తేది.31.07.2023నాటి **GUNBRTF2307260007** ప్రకారం ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్‌లో **02.01.2025** నాటికి **రూ.44,76,982/- (రూపాయలు నలభై నాలుగు లక్షల డెబ్బై ఆరు వేల తొమ్మిది వందల ఎనభై రెండు మాత్రమే)** 03.01.2025 నుండి తదుపరి వడ్డీతో దిగువ పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించమని **1) శ్రీ మహమ్మద్ ఇబ్రహీం, (రుణగ్రహీత)**, తండ్రి శ్రీ ఖాసిం మహమ్మద్, డి.నెం.15-10-2, వినోభా నగర్, 1వ లేన్, పాత గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ -522 001, **2) శ్రీ సయ్యద్ జీలానీ, (హామీదారు)** తండ్రి శ్రీ నబీ సాహెబ్ సయ్యద్, డి.నెం.15-10-2, వినోభా నగర్, 1వ లేన్, పాత గుంటూరు, కొత్తపేట, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్-522001. **3) శ్రీమతి సయ్యద్ అక్తరున్నీసా (హామీదారు/ తనఖాదారు)** భర్త శ్రీ సయ్యద్ జీలానీ, డి.నెం.15-10-2, వినోభా నగర్, 1వ లేన్, పాత గుంటూరు, కొత్తపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 001. **4) శ్రీ సయ్యద్ ఇమ్రాన్ (హామీదారు)** తండ్రి శ్రీ సయ్యద్ జీలానీ, డి.నెం.15-10-2, వినోభా నగర్, 1వ లేన్, పాత గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 001, **5) శ్రీ షేక్ కరీముల్లా (హామీదారు)** తండ్రి శ్రీ.అబ్దుల్ షుకూర్ షేక్, డి.నెం.5-10-2, వినోభా నగర్, 1వ లేన్, పాత గుంటూరు, విటిసి గుంటూరు, పి.ఓ.కొత్తపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 001 వారిని కోరుతూ తేది.**03.01.2025**నాటి డిమాండ్ నోటీసులు జారీచేయబడినది.

రుణగ్రహీతలు/తనఖాదారులు బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా తనఖాదారు/హామీదారులు/రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ సంతకందారుడు సరూల్ సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవగల సదరుచట్టంలోని సెక్షన్ 13(4)క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు ఆస్తిని **18 జూన్, 2025న** స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది.

హామీదారులు/తనఖాదారులు మరియు రుణగ్రహీతకుప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా దిగువ పేర్కొన్న ఆస్తితో ఎలాంటి లావాదేవీలను నిర్వహించొద్దు మరియు లావాదేవీలు జరపదలచిన వారు **మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి మొత్తం **02.01.2025 నాటికి రూ.44,76,982/-** మరియు ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ ఖాతాలో 03.01.2025 నుండి తదుపరి వడ్డీతో చెల్లించుటకు లోబడి ఉంటుంది. [illegible]

[illegible]

తేది: 18.06.2025 — అధీకృత అధికారి & వైస్ ప్రెసిడెంట్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్-సెక్యూర్డ్ క్రెడిటార్

AXIS BANK LIMITED
రిటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002
రూల్-8(1) క్రింద స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (పూర్వం యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడినది) యొక్క [illegible] ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006, ఇతర దీని బ్రాంచ్ ఆఫీసు: **రిటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్** [illegible] **అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** వద్ద కలిగియుండి మరియు [illegible] ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద మరియు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన [illegible] జారీచేయబడినది.

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు/హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	[illegible]
1.	1) మెసర్స్ రామకృష్ణ అగ్రోటెక్ కొమరిపాలెం, ప్రతినిధియైన దీని యజమాని: తేతల దినేష్ రెడ్డి, డోర్ నెం.2-162/బి, ఐటిఐ రోడ్, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533346. 2) శ్రీ తేతల దినేష్ రెడ్డి, తండ్రి తేతల వెంకట [illegible] Loan Account No. 921030040682287	Rs. 1,02,90,925.06/- [illegible]	[illegible]
2	[illegible] Loan Account No. 922030054292976 & 920020033318948	Rs. 2,23,47,341.42/- [illegible]	[illegible]
3	[illegible] Loan Account No. 924060049801878	Rs. 2,73,94,213.07/- [illegible]	[illegible]

తేది: 23-06-2025, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

కరవమంటే కప్పకి కోపం

రుద్ర అల్లరి రోజురోజుకీ శృతి మించిపోతోంది. వస్తువులు పాడుచేయడం, గోడలపై గీతలు గీయడం చేస్తున్నాడు. ఒక రోజు బంకమట్టిలో చేతులు ముంచి గోడలపై అచ్చులు వేశాడు. అమ్మ చూస్తే తిడుతుందని గోడ మీద నీళ్ళుపోసి గుడ్డతో తుడిచాడు.

ఈ తతంగం జరుగుతున్నప్పుడే రుద్ర తల్లి సౌమ్య పెరట్లో నుండి ఇంట్లోకి వచ్చింది. ఇల్లంతా వరద, బురదగా ఉంది. సౌమ్య కోపం నషాళానికెక్కింది. రుద్ర వీపుమీద నాలుగు దెబ్బలు వేసింది.

రుద్ర ఏడుస్తూ ఉంటే చూడలేకపోయింది మునిమామ్మ. పడుతూలేస్తూ వచ్చి రుద్రని దగ్గరకి తీసుకుంది. 'పిల్లలన్నాక తప్పులు చేస్తారు. అంతమాత్రానికి కొడతావా?' అంటూ సౌమ్యని కసురుకుంది.

'మీ అతి గారాబం వల్లే వాడు ఇలా తయారయ్యాడు' అంది సౌమ్య కాస్త కోపంగా.

'కరవమంటే కప్పకి కోపం వదలమంటే పాముకి కోపం' అని చిన్నగా తనలో తను అనుకుంది మునిమామ్మ. 'అంటే.. మీ ఉద్దేశ్యం?' అంటూ మునిమామ్మ గారి వైపు గుర్రున చూసింది సౌమ్య.

'నా మీద ఎందుకే నీకు కోపం. అది ఓ సామెత. ఇప్పుడు సరిగ్గా సరిపోయింది అందుకే చెప్పాను' అంటూ సామెత వెనుక ఉన్న కథ చెప్పడం ప్రారంభించింది. 'ఒక పెద్ద అడవిలో అనేక జంతువులు నివసిస్తూ ఉండేవి. కప్ప, ఎలుక మంచి స్నేహితులు. ఒకరోజు రెండూ కబుర్లు చెప్పుకుంటున్నాయి ఆ సమయంలో ఒక పాము వచ్చి కప్పని నోటకరచింది. అది చూసిన ఎలుక బాధ పడుతూ 'నా మిత్రుడిని చంపకు వదిలెయ్యి' అని ప్రాధేయపడింది. ఆ మాట విన్న పాము ఎలుక వైపు గుర్రుగా చూసింది. 'వదలమంటే నీకు (పాముకు) కోపం. కరవమంటే కప్పకు కోపం' అని బాధ పడుతూ కలుగులోకి వెళ్ళిపోయింది ఎలుక. అలా ఉంది నా పరిస్థితి. కొట్టొద్దు అంటే నీకు కోపం. కొట్టమని చెప్తే వాడికి కోపం. వాడు ఏడుస్తూ ఉంటే చూస్తూ ఊరుకోలేను. ఇలా ఎటూ చెప్పలేని పరిస్థితిలో వాడే సామెత ఇది' అని తన బాధంతా చెప్పేసరికి సౌమ్య కాస్త చల్లబడి ఏడుస్తున్న రుద్రని దగ్గరకి తీసుకుంది.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445

లెక్క చేయండి

పేర్లు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జంతువులు ఇచ్చాం. వాటి ఇంగ్లీషు పేర్లు, పక్కనే ఉన్న గజిబిజి అక్షరాల్లో ఉన్నాయి. ఆ వరుసల్లో నిలువు, అడ్డం, వంకరగా ఉన్న వాటి పేర్లను మీరు కనిపెట్టండి.



నేను గీసిన బొమ్మ



- జోగ చిరుతేజ,
3వ తరగతి,
ఎంపిపిఎస్,
గొంపవానిపాలెం,
కె.కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

జీవన సౌరభం

గమ్యం ఎంత దూరంలో ఉన్నప్పటికీ దానిని చేరుకునే మార్గం మొదటి అడుగు నుంచే మొదలవుతుంది.

మీకోసం

ఈగలు ఎక్కువగా వస్తున్న ప్రదేశంలో పుదీనా ఆకులను కత్తిరించి పెడితే ఈగల బెడద తగ్గుతుంది.

JEEVANA జీవన the family

ప్రతిభకి అవకాశం తోడైతే ...

కఠోర శ్రమ.. కోచింగ్ కోసం లక్షల్లో ఖర్చు చేసినా నీట్ పరీక్షల్లో ర్యాంకు రావడం కష్టమంటారు చాలామంది. అలాంటివారు రాజస్థాన్‌కి చెందిన శ్రావణ్ గురించి తప్పక తెలుసుకోవాలి. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రావణ్ తల్లిదండ్రులు పెళ్లిళ్లల్లో వంటపాత్రలు కడిగే పని చేస్తారు. ఆ పని లేనప్పుడు కూలి చేసుకుని పొట్ట నింపుకుంటారు. మట్టిగోడలు, గడ్డి పైకప్పుతో చిన్న చిన్న గదులు ఉన్న ఇల్లు శ్రావణ్‌ది. చెల్లి, తమ్ముడు, నానమ్మ, తనతో కలిపి మొత్తం ఆరుగురు ఆ ఇంట్లోనే ఉంటారు. ఇట్లాంటి పరిస్థితుల్లో కుటుంబ పోషణ కోసం 19 ఏళ్ల శ్రావణ్ ఫ్యాక్టరీ వర్కర్‌గా పని చేసుకుంటూ నీట్ పరీక్షకి సిద్ధమయ్యాడు. పగలంతా పనిచేసి, రాత్రుళ్లు చదువుకున్నాడు. మొన్న జూన్ 14 నీట్ పరీక్షా ఫలితాలు వచ్చినప్పుడు కూడా అతడు పనిచేసుకుంటూ ఉన్నాడు. 2025 నీట్ పరీక్షల్లో ఆలిండియా 9754 ర్యాంకు సాధించిన శ్రావణ్ ఓబిసి విభాగంలో 4071వ పొజిషన్‌లో రాజస్థాన్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సంపాదించాడు. శ్రావణ్‌ది సాధారణ విజయగాథ కాదు. ఎన్ని కఠిన పరిస్థితులు వచ్చినా విచ్ఛిన్నం చేయలేని విజయమిది.



ప్రతీకాత్మక చిత్రం

శ్రావణ్ పుట్టింది రాజస్థాన్‌లోని మారుమూల పల్లె ఖట్టు. బలోత్రా జిల్లాలో ఉంది. చదువులో ఎప్పుడూ చురుగ్గా ఉండే శ్రావణ్ పదోతరగతిలో 97 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఇంటర్మీడియట్‌లో 87.8 శాతం మార్కులు సాధించాడు. అయితే ఆర్థికపరిస్థితులు సహకరించక పదోతరగతితోనే చదువుకు స్వస్తి చెప్పి ఫ్యాక్టరీలో పనికి వెళ్లిపోయాడు. డాక్టర్ కావాలన్న అతని చిరకాల కలని తన మనసులో నుండి నిదానంగా చెరిపేయడం ప్రారంభించాడు. కానీ అతని ప్రతిభ గుర్తించిన మాస్టారు చిమ్‌నారామ్, శ్రావణ్ అలా కూలీగా ఉండిపోవడం తట్టుకోలేకపోయారు. స్థానిక ఎన్‌జీవోని సంప్రదించి శ్రావణ్ పరిస్థితి వివరించారు. '50 గ్రామాల ఫౌండేషన్' పేరుతో నడుపుతున్న ఆ సంస్థ శ్రావణ్ పైచదువులకు సహాయం చేస్తానని ముందుకువచ్చింది. స్కూలు ఫీజులు, హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, నీట్ కోచింగ్ వంటి ఖర్చులన్నీ భరించింది.

రెండు సార్లు విఫలం..

మాస్టారు ఇచ్చిన ప్రోత్సాహంతో శ్రావణ్ మళ్లీ చదువు కొనసాగించాడు. ఇంటర్‌లో బైపీసీ తీసుకుని నీట్ పరీక్షకు సిద్ధమయ్యాడు. 2023లో మొదటి ప్రయత్నంలో 519 మార్కులతో కటాఫ్ కంటే తక్కువ తెచ్చుకుని అవకాశం కోల్పోయాడు. ఆ తరువాత 620 మార్కులు సాధించినా అధిక కటాఫ్ మార్కుల వల్ల రెండోసారీ చేజార్చుకున్నాడు. రెండుసార్లు విఫలమైనా ఏమాత్రం నిరాశ చెందకుండా, ఈ ఏడాది మూడో ప్రయత్నం చేశాడు. ప్రభుత్వ వైద్యులు ఆన్‌లైన్లో ఇచ్చిన ఉచిత కోచింగ్ క్లాసులను శ్రద్ధగా అధ్యయనం చేసి మరీ ఈ ఏడు సీటు సాధించాడు. తన చదువు గురించి శ్రావణ్ ఇలా చెప్పాడు.

స్మార్ట్‌ఫోన్ ఆలంబనగా..

'కోచింగ్‌కి సంబంధించి యూట్యూబ్‌లో వీడియోలు చూశాను. స్మార్ట్‌ఫోన్ కొనుక్కోలేని నేను ప్రభుత్వ సాయం ద్వారా ఉచిత ఇంటర్‌నెట్ కనెక్షనుతో అమ్మకి వచ్చిన ఫోను ద్వారా పరీక్షకు సిద్ధమయ్యాను. స్మార్ట్ ఫోను నా లక్ష్యాన్ని మరింత దగ్గరచేసింది. నీట్ కోసం ఆన్‌లైన్లో ఎన్నో విశ్లేషణలు శోధించాను. మరెన్నో ప్రశ్నలకు సమాధానాలు వెతికాను' అంటున్న శ్రావణ్, పగలంతా ఫ్యాక్టరీ పనులకు, విరామ సమయాల్లో నాన్నకు సాయంగా గిన్నెలు కడిగేందుకు వెళ్లాడు. రాత్రుళ్లు చదువు కొనసాగించాడు.

ఇంటిపైకప్పు సరిచేసుకుంటున్నప్పుడు..

శ్రావణ్ నీట్ ర్యాంకు సాధించిన విషయం తెలిసే సమయానికి వాళ్ల నాన్న రేఖారామ్ సియాగ్, ఇంటిపైకప్పు మరమ్మతు పనులు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమౌతున్నందున తమ గుడిసెపై చెల్లాచెదురైన గడ్డిని సరిచేసుకుంటున్నారు. ఈ వార్త తెలిసిన క్షణాన ఆ తండ్రి ఆనందానికి అవధులు లేవు. 'నా కొడుకు డాక్టర్ అవుతున్నాడు' అని పెద్దగా కేకలు వేశాడు. గంటల వ్యవధిలో గ్రామమంతా ఈ వార్త తెలిసేసరికి గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థ వారు స్వీట్ ప్యాకెట్లతో ఆ ఇంటిని చుట్టుముట్టారు. వారందరినీ చూసి కొడుకు సాధించిన ఘనత తలచుకుని శ్రావణ్ తల్లి ఆనందంతో కన్నీరు కార్చింది. చెల్లి, తమ్ముడు అక్కడే నిలబడి, ప్రతి ఒక్కరి అభినందనలు వింటూ అన్న వైపు గర్వంగా చూస్తున్నారు. కృతజ్ఞతా భావంతో నానమ్మ జోడించిన చేతులు చాలాసేపటి వరకు అలాగే ఉండిపోయాయి. ఈ ఆనందం, సంతోషం శ్రావణ్ సాధించిన నీట్‌ర్యాంకు వల్ల మాత్రమే కాదు.. భవిష్యత్తులో అతను డాక్టరై తమలాంటి వారికి అతను చేసే సేవలను గుర్తుకు వచ్చి కూడా!

గ్రామాల్లో వైద్యం అందిస్తా ...

డాక్టరు వృత్తి చేపట్టిన తరువాత చేసే పనుల గురించి శ్రావణ్ ఇలా చెప్పాడు. 'నేను డాక్టర్‌ని అయ్యాక, గ్రామాల్లో సేవలు చేస్తాను. వైద్యుడు లేక ఇక్కడ ఏ ఒక్కరూ చనిపోకూడదు. భాష రాక ఎవరూ వైద్యానికి దూరం కాకూడదు' అంటున్నాడు. 'డాక్టరైన వెంటనే ఏం చేస్తార'ని అడిగినప్పుడు 'మా అమ్మానాన్నలకు వంట పాత్రలు కడిగే శ్రమ లేకుండా చేస్తాను. మంచి ఇల్లు కట్టి, వాళ్లని సంతోషపెడతాను' అంటున్నాడు.

లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థులు పేదరికం కారణంగా చదువు మానేసి తమ కలలను చెరిపేసుకుంటున్నారు. అటువంటి వారి ప్రతిభకి అవకాశం కలిసివస్తే ఎంతటి విజయం సాధ్యమవుతుందో శ్రావణ్ ప్రయాణం ఒక ఉదాహరణ.

'టూరిస్ట్ ఫ్యామిలీ'

మానవీయ విలువలకు ప్రతిరూపం

ఓ సినిమాలో దర్శకుడు త్రివిక్రమ్ రాసినట్లుగా 'బాగుండడం అంటే బాగా వుండటం కాదు.. నలుగురితో వుండటం.. నవ్వుతూ వుండటం.' అనే డైలాగ్ ఎవ్వరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. మనం గెలిచినప్పుడు చప్పట్లు కొట్టే వారు, మనం ఓడిపోయినప్పుడు భుజం తట్టేవారు నలుగురు లేనప్పుడు ఎంత సంపాదించినా..ఎంత పోగొట్టుకున్నా తేడా ఉండదు.

జీవితమంటే గొప్పగా బతకడం కాదు.. నలుగురితో నవ్వుతూ బతకడమని చెప్తుంటారు పెద్దలు. కానీ నేటి సమాజంలో డబ్బు, హోదా, పరపతి ధ్యాసలో పడి తోటి వాళ్లను పలకరిస్తే ఎక్కడ వాళ్ల గొప్పతనం తగ్గిపోతుందోనని భావించే మనుషులే ఎక్కువ. ఇలా మానవత్వాన్ని మర్చిపోతున్న ఎంతో మందిని తన మంచి మనసుతో మార్చేశాడు ధర్మదాస్. పక్కవాళ్లు చనిపోతున్నా పట్టించుకోకుండా ఫోన్లలోనే బిజీగా గడుపుతున్న నేటితరానికి ఎలా బతకాలో నేర్పించాడు. మరి ఇంతకీ ఈ దాస్ ఎవరు? ఆయన కథేంటి? అనేది తెలుసుకోవాలంటే 'టూరిస్ట్ ఫ్యామిలీ' చూడాల్సిందే.

కొన్ని సినిమాలు వినోదాన్ని పంచుతూ ప్రేక్షకుల్ని మెప్పిస్తే.. మరికొన్ని జీవిత పాఠాలు నేర్పుతూ మనసుల్ని తాకుతాయి. 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ కోవకు చెందిందే. కుటుంబం, బంధాల విలువల్ని తెలుపుతూ.. ప్రతి మధ్యతరగతి వ్యక్తితో నేరుగా మాట్లాడినట్టు ఉంటుందీ చిత్రం. అవతలి వాళ్లు పలకరిస్తేనే మనం పలకరించాలి అనుకునే మనుషుల్ని ప్రశ్నిస్తుంది.. ఆలోచింపజేస్తుందీ చిత్రం. 'చివరి శ్వాస వరకూ నా కుటుంబం కోసం పోరాడుతూనే ఉంటా' లాంటి సంభాషణలతో ఫ్యామిలీ కోసం కష్టపడే సగటు తండ్రి మనోవేదనను.. పిల్లల కోసం ఆరాటే పడే తల్లి మనసును కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ సినిమా ప్రముఖ దర్శకుడు రాజమౌళి, రజనీకాంత్, నాని, సూర్య లాంటి పలువురు సినీతారల్ని మెప్పించింది. ఒక మనిషి తోటి వారితో ఎలా కలిసి జీవించాలో, ఏ విధంగా నడుచుకోవాలో నేర్పించిందీ చిత్రం. నవ్వుతూ బతకడం ఎలాగో చెప్పిందీ సినిమా. ఎంచుకున్న అంశం చిన్నదే అయినా.. దానికి హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, కామెడీని జోడించి తెరపై ఆవిష్కరించిన దర్శకుడు అభిషాన్ జీవింత్‌ను ఎంత మెచ్చుకున్నా తక్కువేనేమో. యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయనకు ఇదే తొలి సినిమా కావడం విశేషం.

జీవన విలువలు ఆవిష్కృతం

ఈ సమాజంలో ఒక మనిషి తోటివారితో కలిసి ఎలా జీవించాలి? ఆపద సమయంలో ఒకరికొకరు ఏవిధంగా సహాయపడాలి? ఇలా.. జీవితానికి దగ్గరగా ఉండే ఎన్నో అంశాల్ని తెరపై ఆవిష్కరించి ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకుంది 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రం. అభిషాన్ జీవింత్ తెరకెక్కించిన ఈ తమిళ చిత్రం మేలో విడుదలై ఎంతోమంది మనసుని హత్తుకుంది. శశికుమార్, సిమ్రాన్, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. 'చివరి శ్వాస వరకూ నా కుటుంబాన్ని కాపాడుకుంటాను' అంటూ తన ఫ్యామిలీ కోసం కష్టపడే సగటు తండ్రి మనోవేదనను కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ సినిమాకు బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ ఎందరో ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఇందులో శశికుమార్ ధర్మదాస్ పాత్రలో, సిమ్రాన్ వాసంతిగా కనిపించి వారి నటనతో ఆకట్టుకున్నారు. శ్రీలంకకు చెందిన ధర్మదాస్ తన భార్య వాసంతి, కుమారులతో కలిసి భారత్‌కు అక్రమంగా వస్తాడు. చెన్నైలో తన కుటుంబంతో కలిసి ఓ కాలనీలో స్థిరపడతాడు. తమ వివరాలు ఎవరికీ తెలియకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాడు దాస్. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ కాలనీ మనుషులు మర్చిపోతున్న మానవత్వాన్ని తన మంచి మనసుతో దాస్ ఎలా గుర్తు చేశాడు? అనేదే ఈ సినిమా కథాంశం. శశికుమార్, సిమ్రాన్, మిథున్ జైశంకర్, కమలేష్, యోగిబాబు తదితరులు నటించారు. అభిషణ్ జీవింత్ దర్శకత్వంలో నజెరాత్ పసిలియన్-మగేష్‌రాజ్ పసిలియన్-యువరాజ్ గణేశన్ నిర్మాణ సారధ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. సియాన్ రోల్డన్ సంగీతం కూడా ఆకట్టుకునేలా సాగింది. అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ కూడా అద్భుతంగా ఉంది. మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్‌పి ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లు ఈ సినిమాను నిర్మించాయి. కుటుంబ జీవన విధానాన్ని పట్టిచూపిన ఈ సినిమా దేశవ్యాప్తంగా విశేషంగా ఆకట్టుకుంటోంది. యావత్ తమిళ సినిమా ఇండస్ట్రీ మొత్తం భుజాన వేసుకుని ఈ సినిమా ప్రమోట్‌చేసింది.

కథ సాగిందిలా...

ధర్మదాస్ (శశికుమార్) కుటుంబంతో కలిసి శ్రీలంక నుంచి వలస వస్తాడు. తనను నమ్ముకుని వచ్చిన భార్య, ఇద్దరు కొడుకులతో చెన్నైలో ఒక కాలనీలో సెటిలవుతాడు. అక్కడి మనుషులతో ఎలా కలిసిపోయాడు? ఆ కాలనీలో మనుషులు మర్చిపోతున్న మానవత్వాన్ని తన మంచి మనసుతో ఎలా గుర్తుచేశాడు? అనేది 'టూరిస్ట్ ఫ్యామిలీ' కథాంశం. ఈ సినిమాలోనూ సిమ్రాన్ ఓ సగటు గృహిణిగా ఇంత హృద్యమైన మధ్యతరగతి పాత్రలో జీవించారు. శశికుమార్‌కు ఈ తరహా మంచి మనిషి పాత్రలు కొత్తేమీ కాదు.

ఓటీటీలో విడుదలై మంచి రెస్పాన్స్ అందుకున్న 'అయోథి' చిత్రంలోనూ ఇదే తరహా పాత్ర పోషించాడు. అయితే.. ఈ చిత్రంలో కుటుంబాన్ని సరిగ్గా చూసుకోలేకపోతున్నానంటూ కుమిలిపోయే సన్నివేశంలో అతడి నటన చాలా రిలేటబుల్‌గా ఉంటుంది. స్టార్ పెర్ఫార్మర్ కమలేష్ అని చెప్పాలి. ఆ బుడ్డోడి ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ ప్రతీదీ అద్భుతంగా కుదిరింది. ఇక కామెడీ పంచులతో విశేషంగా ఆకట్టుకుని సినిమాకి బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్‌గా నిలిచాడు. మిథున్ జైశంకర్ పాత్ర మొదట్లో పెద్దగా వర్కవుట్ అవ్వకపోయినా.. సెకండాఫ్‌లో వచ్చే ఒక ఎమోషనల్ సీన్‌లో అతడు చెప్పే డైలాగ్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. ఇక యోగిబాబు ఎప్పట్లానే చాలా సరదాగా నవ్వించాడు. ఇక కాలనీ వాసులుగా నటించినవారందరూ మనస్ఫూర్తిగా పాత్రల్లో ఒదిగిపోయారు.

బుమ్రా బూమ్ బూమ్

- ఐదు వికెట్లతో విజృంభణ
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 465/10
- భారత్ రెండో ఇన్నింగ్స్ 90/2
- మూడో రోజు ముగిసిన ఆట

బుమ్రా విజృంభించాడు. ఐదు వికెట్లతో మెరిసిన బుమ్రా.. లీడ్స్‌లో భారత్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందించాడు. ఒలీ పోప్ (106), హ్యారీ బ్రూక్ (99) సహా టెయిలెండర్లు రాణించటంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులు చేసింది. టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 6 పరుగుల ఆధిక్యం సాధించింది.

లీడ్స్ : పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా (5/83) ఐదు వికెట్ల ప్రదర్శనతో నిప్పులు చెరిగాడు. టాప్ ఆర్డర్‌ను కకావికలం చేసిన బుమ్రా.. ఆఖర్లో టెయిలెండర్లను సైతం పెవిలియన్‌కు పంపాడు. ప్రసిద్ కృష్ణ (3/128), మహ్మద్ సిరాజ్ (2/122) సైతం వికెట్ల వేటలో బుమ్రాకు జతకలిశారు. దీంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 100.4 ఓవర్లలో 465 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఓపెనర్ ఒలీ పోప్ (106, 137 బంతుల్లో 14 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (99, 112 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ (40, 52 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), క్రిస్ వోక్స్ (38, 55 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), బ్రైడన్ కార్స్ (22, 23 బంతుల్లో 4 ఫోర్లు) ధనాధన్ జోరు చూపించారు. టెయిలెండర్లు రాణించటంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో లోటు 6 పరుగులకు కుదించుకుంది.

బ్రూక్ మెరుపుగా.. : యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (99) దంచికొట్టాడు. 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 112 బంతుల్లోనే 99 పరుగులు సాధించాడు. వన్డే తరహాలో పరుగులు పిండుకున్న బ్రూక్.. ఇంగ్లాండ్ స్కోరు వడివడిగా ముందుకు సాగించాడు. ఓవర్‌నైట్ సెంచరీ హీరో ఒలీ పోప్ (106) త్వరగా నిష్క్రమించినా.. కెప్టెన్ బెన్ స్టోక్స్ (20), వికెట్ కీపర్ జెమీ స్మిత్ (40), క్రిస్ వోక్స్ (38)తో కలిసి వరుసగా 51, 73, 49 పరుగుల భాగస్వామ్యాలు నిర్మించాడు. బజ్‌బాల్ షో చూపించిన బ్రూక్.. ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 65 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. బ్రూక్ నిష్క్రమించినా.. ఇంగ్లాండ్ టెయిలెండర్లు పరుగుల వేట ఆపలేదు. క్రిస్ వోక్స్, జోశ్ టంగ్ (11) తొమ్మిదో వికెట్‌కు మరో 55 పరుగులు జోడించారు. దీంతో 100.4 ఓవర్లలోనే ఇంగ్లాండ్ 465 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 6 పరుగుల ఆధిక్యం కోల్పోయింది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 471/10

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : క్రాలీ (సి) నాయర్ (బి) బుమ్రా 4, డకెట్ (బి) బుమ్రా 62, పోప్ (సి) పంత్ (బి) ప్రసిద్ 106, రూట్ (సి) నాయర్ (బి) బుమ్రా 28, బ్రూక్ (సి) ఠాకూర్ (బి) ప్రసిద్ 99, స్టోక్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20, స్మిత్ (సి) సాయి (బి) ప్రసిద్ 40, వోక్స్ (బి) బుమ్రా 38, కార్స్ (బి) సిరాజ్ 22, టంగ్ (బి) బుమ్రా 11, బషీర్ నాటౌట్ **1, ఎక్స్‌ట్రాలు :** 34, మొత్తం : (100.4 ఓవర్లలో ఆలౌట్) 465.

వికెట్ల పతనం : 1-4, 2-126, 3-206, 4-225, 5-276, 6-349, 7-398, 8-453, 9-460, 10-465.

బౌలింగ్ : బుమ్రా 24.4-5-83-5, సిరాజ్ 27-0-122-2, ప్రసిద్ 20-0-128-3, జడేజా 23-4-68-0, ఠాకూర్ 6-0-38-0.

బుమ్రా ఐదు వికెట్ల జోరు : బుమ్రా (5/83) ఐదు వికెట్లతో మెరిశాడు. రెండో రోజు ఆటలోనే మూడు వికెట్లు పడగొట్టిన బుమ్రా.. మూడో రోజు ఇంగ్లాండ్ టెయిలెండర్ల కథ ముగించాడు. భారత ఫీల్డర్లు తరచుగా క్యాచ్‌లు నేలపాలు చేయడం దెబ్బతీసింది. ఒలీ పోప్‌కు మూడుసార్లు జీవనదానం లభించగా.. హ్యారీ బ్రూక్ భారత మిస్ ఫీల్డింగ్‌తో లబ్ది పొందాడు. లేదంటే, టాప్ ఆర్డర్ వికెట్లతోనే ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేయాల్సిన బుమ్రా.. టెయిలెండర్ల వికెట్ల వరకు ఎదురుచూడాల్సి వచ్చింది. బుమ్రాకు మరో ఎండ్‌లో బ్యాటర్లపై ఒత్తిడి పెంచే పేసర్ కరువయ్యాడు. నాల్గో పేసర్ శార్దూల్ ఠాకూర్ ఆరు ఓవర్లలో 38 పరుగులు ఇచ్చి ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ప్రసిద్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టగా.. మహ్మద్ సిరాజ్ రెండు వికెట్లు తీసుకున్నాడు. రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్‌కు వికెట్లు దక్కలేదు.

ఇంగ్లండ్ పేసర్ డేవిడ్ లారెన్స్ కన్నుమూత

లీడ్స్ : ఇంగ్లండ్ వెటరన్ పేసర్ డేవిడ్ లారెన్స్ ఆదివారం కన్నుమూశాడు. నరాల వ్యాధితో బాధపడుతున్న 61 ఏళ్ల డేవిడ్ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచాడు. డేవిడ్ లారెన్స్ పేస్ బౌలింగ్‌కు పెట్టింది పేరు. 80వ దశకంలో స్టన్నింగ్ బౌలింగ్‌తో బ్యాటర్లను భయపెట్టాడు. 1988 నుంచి 1992 వరకు ఇంగ్లండ్‌కు ఆడిన ఈ బౌలర్.. జాతీయ జట్టుకు 5 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. మోకాలి గాయం కారణంగా అతడి కెరీర్ మధ్యలోనే ఆగిపోయింది. వర్ణ వివక్షతో పాటు కెరీర్‌లో ఎదుర్కొన్న ఇతర సమస్యలు, ఆరోగ్యం విషయంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి అతడు పలుమార్లు బహిరంగంగానే తన అభిప్రాయాలను పంచుకున్నాడు. ఇంగ్లండ్-భారత్ మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో అతడికి నివాళిగా క్రికెటర్లు చేతికి నల్లరిబ్బన్లు కట్టుకుని బరిలోకి దిగారు. రెండో రోజు ఆట మొదలవడానికి ముందు ఇరు జట్ల ఆటగాళ్లు ఒకే వరుసలో నిలుచొని చప్పట్లతో సంఘీభావం తెలిపారు. క్రికెట్‌కు అతడు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

టీ20 ప్రపంచ కప్ 2026కు అర్హత సాధించిన కెనడా

కింగ్ సిటీ : టీ20 ప్రపంచ కప్ 2026కు కెనడా జట్టు అర్హత సాధించింది. కింగ్ సిటీ వేదికగా జరిగిన అమెరికాస్ క్వాలిఫైయర్‌లో బహామాస్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన కెనడా.. వరల్డ్‌కప్ బెర్త్‌ను ఖారారు చేసుకుంది. పొట్టి ప్రపంపకప్‌నకు కెనడా క్వాలిఫై కావడం ఇదే రెండో సారి. మెరికాస్ క్వాలిఫైయర్‌లో భాగంగా ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌లోనూ విజయం సాధించిన కెనడా.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బహామాస్ కేవలం 57 పరుగులకే ఆలౌటైంది. కెనడా బౌలర్లలో కలీం సానా, శివమ్ శర్మ తలా మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించగా.. అన్షా పటేల్ రెండు వికెట్లు సాధించారు. అనంతరం 58 పరుగుల లక్ష్యాన్ని కెనడా కేవలం 5.3 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి చేధించింది. కెనడా బ్యాటర్లలో దిల్‌ప్రీత్ బజ్వా(36) అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించాడు.

13వ జట్టుగా..

2026 టీ 20 వరల్డ్ కప్‌లో 20 జట్లు బరిలోకి దిగనున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం ఐసీసీ ఇప్పటికే 12 జట్లకు నేరుగా అర్హత కల్పించింది. ఆతిథ్య దేశ హోదాలో భారత్, శ్రీలంక క్వాలిఫై కాగా.. టీ20 వరల్డ్‌కప్-2024 టాప్-8లో నిలిచిన జట్లు ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, అఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68